# ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం



# వార్త

ఆదివారం 19, జులై 2026 | 16 పేజీలు


# దమ్మపేట ప్రక్షాళనకు ట్రైనీ కలెక్టర్

2లో

ఐఎఎస్ సారధ్యంలో కొన్నాళ్ళు మండల రెవెన్యూ తహశీల్దార్..జిపిఓ ల సస్పెన్షన్

అక్రమ ఆర్ఓఆర్ విచారణపై తీవ్ర అసంతృప్తి

ఆపరేటర్ రమేష్‌కి రూ.10వేల ఫోన్‌పే మతలబేమి

వివరాలకోసం యత్నిస్తే ఆయన ఫోన్ స్విచ్ఛాఫ్

అనంతమ్మ అక్కౌంట్ నుంచి ఎందుకు బదిలీ అయింది

ఎంక్వయిరీలో దీన్ని విస్మరించారంటూ నిలదీత

కార్యాలయంలో ఓ అనధికార శక్తిపై చర్యలకు డిమాండ్

ఒకరి అక్రమాలను మరొకరు తవ్వుకుంటూ భ్రష్టుపట్టిస్తున్నారు

అశ్వారావుపేట/దమ్మపేటరూరల్/ ప్రభాతవార్త : ఎప్పుడో ఓ రోజు ఇలాంటి పరిస్థితి దమ్మపేట రెవెన్యూకి ఎదురవ్వక తప్పదని ప్రభాతవార్త ఇదివరలో అనేకమార్లు అనేక సందర్భాల్లో చెప్పడం పాఠకులకు విదితమే. ఇన్నాళ్ళకు అక్షరాలా అదే జరిగింది. ఇక్కడి ఏజన్సీలో అంతులేని అక్రమ భూయాజమాన్య హక్కుల మార్పిడి భాగోతాలు "పాపం పండేంత" స్థాయికి చేరుకుని ఈరోజున తహశీల్దార్..ఓ గ్రామపాలనాధికారి ఇద్దరూ సస్పెండయ్యే దాకా వెళ్ళింది.

## ఖమ్మం జిల్లా రహదారుల ప్రగతికి తుమ్మల చొరవ

2లో



మంత్రి ప్రత్యేక కృషితో రూ.94.50 కోట్ల మంజూరు

ఆరు కీలక రహదారుల అభివృద్ధికి పరిపాలన అనుమతులు

మంత్రి కోమటిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి తుమ్మల

ఖమ్మం బ్యూరో,ప్రభాతవార్త: ఖమ్మం జిల్లా రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. జిల్లాలోని ఆరు ప్రధాన రహదారుల అభివృద్ధి కోసం మొత్తం రూ.94.50 కోట్లతో పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధుల మంజూరులో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ, నిరంతర కృషి కీలకంగా నిలిచింది.



2లో

## వర్షాలు తక్కువ.. మెట్ట పంటల వైపు దృష్టి సారించాలి

శాస్త్రవేత్తల సూచనల ప్రకారం సాగు విధానాలు మార్చుకోవాలి

కూసుమంచి మండల పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

రూ.4.61 కోట్లతో ప్రగతి పనులకు శంకుస్థాపన..

కూసుమంచి క్యాంపు కార్యాలయంలో చెక్కుల పంపిణీ..



## అశ్వాపురంలో రాజుకున్న పోడు రగడ

2లో

వలస ఆదివాసీలపై అటవీ అధికారుల దౌర్జన్యం..

గ్రామంలో నెలకొన్న ఉద్రిక్త

మహిళా గిరిజన రైతులపై అధికారుల దాడులు

అశ్వాపురం ప్రభాతవార్త : అశ్వాపురం మండల పరిధిలోని మనుబోతుల గూడెం గ్రామపంచాయతీలో ఉద్రిక్తత నెలకొంది. గ్రామపంచా యతీ పరిధిలో ఉన్నటువంటి వేములూరు గ్రామంలో గిరిజనులు పోడు సాగు చేసుకుంటున్న టువంటి భూములను స్వాధీన పరచుకోవటానికి అటవీశాఖ అధికారులు భారీ ఎత్తున మోహరించి ఆ భూములను స్వాధీనపరుచుకునే ప్రయత్నంలో గిరిజనులకు అటవీ శాఖ అధికారులకు మధ్య వాగ్వాదం నెలకొని తీవ్ర ఘర్షణ జరిగింది.

## భద్రాచలం కోర్టుకు పెద్దల పిలుపు..!

24న డిప్యూటీ సీఎంతో పాటు మంత్రుల హాజరు..

సీతారామ కేసులో సమన్లు రాజకీయ కలకలం

22 మందిపై కేసు... 12 మంది మాత్రమే హాజరు

గైర్హాజరైన నేతలకు సమన్లు జారీ

భద్రాచలం కోర్టు చుట్టూ రాజకీయ వేడి

విచారణపై రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ

భద్రాచలం, జూలై 18 ( ప్రభాత వార్త): మూడేళ్ల క్రితం నమోదైన సీతారామ ప్రాజెక్టు సందర్శన కేసు మళ్లీ రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఉన్న మల్లు భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, కాంగ్రెస్‌కు చెందిన కీలక నేతలు ఈ నెల 24న భద్రాచలం కోర్టుకు హాజరుకానుండటంతో రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ మొదలైంది. అధికారంలో ఉన్న మంత్రులు

16లో










# దమ్మపేట ప్రక్షాళణకు ట్రైనీ కలెక్టర్

**ఐఎఎస్ సారధ్యంలో కొన్నాళ్ళు మండల రెవెన్యూ**

**తహశీల్దార్..జిపిఓ ల సస్పెన్షన్**

**అక్రమ ఆర్ఓఆర్ విచారణపై తీవ్ర అసంతృప్తి**

**ఆపరేటర్ రమేష్‌కి రూ.10వేల ఫోన్‌పే మతలబేమి**

**వివరాలకోసం యత్నిస్తే ఆయన ఫోన్ స్విచ్ఛాఫ్**

**అనంతమ్మ అకౌంట్ నుంచి ఎందుకు బదిలీ అయింది**

**ఎంక్వయిరీలో దీన్ని విస్మరించారంటూ నిలదీత**

**కార్యాలయంలో ఓ అనధికార శక్తిపై చర్యలకు డిమాండ్**

**ఒకరి అక్రమాలను మరొకరు తవ్వుకుంటూ భ్రష్ఠుపట్టిస్తున్నారు**

**అశ్వారావుపేట/దమ్మపేటరూరల్/ ప్రభాతవార్త :** ఎప్పుడో ఓ రోజు ఇలాంటి పరిస్థితి దమ్మపేట రెవెన్యూకి ఎదురవ్వక తప్పదని ప్రభాతవార్త ఇదివరలో అనేకమార్లు అనేక సందర్భాల్లో చెప్పడం పాఠకులకు విదితమే. ఇన్నాళ్ళకు అక్షరాలా అదే జరిగింది. ఇక్కడి ఏజన్సీలో అంతులేని అక్రమ భూయాజమాన్య హక్కుల మార్పిడి భాగోతాలు "పాపం పండేంత" స్థాయికి చేరుకుని ఈరోజున తహశీల్దార్..ఓ గ్రామపాలనాధికారి ఇద్దరూ సస్పెండయ్యే దాకా వెళ్ళింది. ఉద్యోగులకు ఇలాంటివి సహజమే అయినా.,బతికున్న వ్యక్తిని రికార్డెడ్‌గా చంపేసి.,అతని హక్కుల్ని మరొకరికి దొడ్డిదారిని దోచిపెట్టిన సంచలన సంఘటన "రాష్ట్రవ్యాప్తంగా" చర్చనీయాంశమై దమ్మపేట పేరు నలుచెరగులా వ్యాపించాక ఈ క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం ఓ విశేషంకాగా., కొన్నాళ్ళపాటు ఎం.మురళి అనే ట్రైనీ కలెక్టర్‌కి దమ్మపేట తహశీల్దార్ కార్యాలయ సారధ్యబాధ్యతలు అప్పగించడం ఇంకో చరిత్రగా చెప్పుకోవచ్చు. ఇక్కడ సాగిన అవినీతి అక్రమాల పుట్టల్ని సమూలంగా పెకలించే బాధ్యతలను ఆయనకు ప్రభుత్వం అప్పగించినట్లు తెలుస్తుండగా., దొంగ డెత్ సర్టిఫికెట్లు.,ఎఫ్ఎంసి ల గుట్టురట్టు కానున్నదా అనే చర్చ స్థానికంగా మొదలైంది. ఇదిలా ఉంటే..మళ్ళ సత్యం ఎపిసోడ్‌లో సాగిన విచారణపై ప్రస్తుత బాధితులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తున్నది. సస్పెన్షన్‌కు గురైన జిపిఓ అనంతమ్మ అకౌంట్ నుంచి ఆపరేటర్ రమేష్‌కి 22.05.2026 తేదీ సాయంత్రం 5.43 నిముషాలకు రూ.10 వేలు ట్రాన్స్‌ఫర్ అయ్యాయి. ఈ చెల్లింపు ఆర్ఓఆర్ లో భాగమేనని విచారణ సందర్భంగా ప్రస్తావించినా.,ఆ పాయింట్ పక్కకి వెళ్ళిందనే ఆవేదన ఇప్పుడు ప్రముఖంగా తెరమీదికొస్తున్నది. ఏ అవసరం కోసం రమేష్ కి రూ.10వేలను గ్రామపాలనాధికారి పే చేశారనేది తెలియడంలేదు. వివరాలడిగేందుకు ప్రయత్నిస్తే ఆపరేటర్ వీర్నాల రమేష్ ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. కేవలం అక్రమ ఆర్ఓఆర్ కోసమే ఇది ప్రతిఫలమంటూ నిందిస్తున్నా.,ఖచ్చితంగా దానికోసమేననేది మాత్రం రుజువుచేయడం ఎలా అనే దానిపై అనుమానాలున్నాయి. బహుశా అందుకనేనేమో విచారణాధికారి దీన్ని పక్కనపెట్టి ఉండవచ్చు. కాకపోతే ఈ విషయంలో చాలా సీరియస్‌గా ఫిర్యాదుదారులు తమ వ్యూహాన్ని ముందుకు తీసుకువెళ్ళే పనిలో ఉన్నట్లు తెలుస్తున్నది. అంతే కాదు ఇదే కార్యాలయంలో మరొక అనధికార కేంద్రం పాత్రమీద కూడా చాన్నాళ్ళుగా తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అన్నీ తానై ఏజన్సీ చట్టాలకు నిలువునా అతను నిప్పుపెట్టడంతో పాటుగా ఏ ఆఫీసర్ వచ్చినా.,వాళ్ళ ప్రమేయాలను పరిమితం చేస్తూ కార్యాలయాన్ని తన చేతుల్లోకి తీసుకుని నడిపిస్తున్నట్లు ఆరోపణలు నిత్యం ఇక్కడ వినిపిస్తుంటాయి. ఇలాంటి సంకట పరిస్థితుల్లో ఓ ఐఎఎస్ అధికారి పాలనా పగ్గాలను చేపట్టడంతో అక్రమంగా ఆర్ఓఆర్‌లు పొందిన వారి గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయి. ఈమధ్యన పత్రికల్లో వచ్చిన ప్రతీ అంశాన్నీ లోతుగా అధ్యయనం చేయడానికి ఆయనకు మార్గదర్శకాలున్నట్లు అనధికార సమాచారం.

**మహిళా లబ్ధిదారుపైనా ఫిర్యాదు**

మళ్ళ సత్యం నకిలీ డెత్‌సర్టిఫికెట్.,ఆపై ఫేక్ ఎఫ్ఎంసి.,వీటి ఆధారంగా దొంగ మ్యుటేషన్.,ఎపిసోడ్‌లో ఎవరైతే లబ్ధిపొందారో వారిమీదా పోలీస్ కంప్లయింట్ ఇచ్చినట్లు సమాచారం. ఐతే ఈ సందర్భంగా మరో సాంకేతిక విఘ్నం యంత్రాంగానికి ఎదురైనట్లు తెలుస్తున్నది. ఎలా అంటే.,ఈ ఫోర్జరీ వ్యవహారంలో ఎవరైతే "అల్టిమేట్ బెనిఫిషరీ" ఉన్నారో వారే ప్రాసిక్యూషన్ ముందు నిలబడాల్సి ఉంటుందని ఇంతకుముందు చెప్పుకున్నాం. కాకపోతే ఇందులో ఇంకాస్తముందుకెళ్ళి చర్చిస్తే లబ్ధిపొందినంత మాత్రాన వారే దోషులుగా తేలతారని కూడా చెప్పలేం. ఎందుకంటే వీరిని బద్‌నాం చేయడానికి వీరిని లబ్ధిదారుగా చూపించేందకు వేరెవరైనా కుట్ర చేసి ఉండవచ్చు. ట్రయల్లో అది నిరూపించబడితే.,కుట్ర సూత్రధారులకు మాత్రమే శిక్షలుంటాయి. ఇదే కోణంలో ఆలోచించి..మళ్ళ సత్యం నుంచి హక్కులు బదలాయించుకున్న ఈ మహిళనే ప్రాథమికంగా ముద్దాయి అనే అవకాశం కూడా లేదుకాబట్టి.,తొందరపడి ఎఫ్ఐఆర్ చేయరాదని ఓ కీలక స్థాయిలో నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఇది కరెక్టే అయినప్పటికీ.,కంటికి కనిపిస్తున్న "ప్రైమాఫసీ" ప్రాతిపదికన మాత్రమే కేసులు కట్టబడతాయి కదా. రేపొద్దున్న విచారణలో నేరస్థులెవరేది తేలుతుంది అది వేరే విషయం. కాబట్టి ఆ మహిళ "దోషా నిర్దోషా" అనేది ఈ ఎర్లీస్టేజ్‌లో ఎవరూ చెప్పకూడదు. ఐతే ఎఫ్ఐఆర్ అనివార్యమా కాదా అనేదే ఇప్పుడు ప్రధాన అంశం.

# అశ్వాపురం మండలంలో రాజుకున్న పోడు రగడ

**వలస ఆదివాసీలపై అటవీ అధికారుల దౌర్జన్యం**

**మహిళా గిరిజన రైతులపై అధికారుల దాడులు**

**గ్రామంలో నెలకొన్న ఉద్రిక్త**

**దాడి ఘటనను ఖండించిన ప్రజా సంఘాలు.**

**అశ్వాపురం ప్రభాతవార్త :** అశ్వాపురం మండల పరిధిలోని మనుబోతుల గూడెం గ్రామపంచాయతీలో ఉద్రిక్తత నెలకొంది. గ్రామపంచా యతీ పరిధిలో ఉన్నటువంటి వేములూరు గ్రామంలో గిరిజనులు పోడు సాగు చేసుకుంటున్నటువంటి భూములను స్వాధీన పరచుకోవటానికి అటవీశాఖ అధికారులు భారీ ఎత్తున మోహరించి ఆ భూములను స్వాధీనపరుచుకునే ప్రయత్నంలో గిరిజనులకు అటవీ శాఖ అధికారులకు మధ్య వాగ్వాదం నెలకొని తీవ్ర ఘర్షణ జరిగింది. మనుబోతుల గూడెం గ్రామపంచాయతీ వేములూరు గ్రామం లో శుక్రవారం అటవీ అధికారులు జెసిబి సహాయంతో ఆదివాసీలు పోడు సాగు చేసుకుంటున్న భూముల్లో కందకాలు తవ్వటానికి ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న ఆదివాసీలు ఘటనా స్థలానికి వెళ్లి జెసిబిని అడ్డుకొని మేము ఎన్నో సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో పోడు వ్యవసాయం చేసుకుంటున్నామని, చెప్పా పెట్టకుండా భారీ యంత్రాలతో వచ్చి మా భూములను అటవీ అధికారులు స్వాధీనపరుచుకోవడం అక్రమమని నినదిస్తూ కందకాలు తవ్వే ప్రయత్నాన్ని విరమించుకోవాలని అడ్డుకున్నారు. ఈ ఘటన నేపథ్యంలో ఇరురువర్గాల మధ్య ఘర్షణ రేకెత్తింది. ఈ ఘర్షణ చిలికి చిలికి గాలివానగా మారి ఒకరిపై ఒకరు పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో అటవీ అధికారుల చేతులో మహిళా గిరిజన రైతులు, అదే క్రమంలో గిరిజన రైతుల చేత కొంతమంది అటవీ అధికారులు కూడా గాయపడ్డారు. సంఘటనా స్థలంలో ఇద్దరు గిరిజన మహిళ రైతులు అస్వస్థతకు గురై కింద పడిపోవడంతో ఆదివాసీల్లో ఆగ్రహం కట్టలు తెంచుకొని పరిస్థితిలో ఒక దశలో పరిధి దాటిపోయి ఇరువర్గాలు ఒకరికొకరు కర్రలతో రాళ్లతో కొట్టుకున్న పరిస్థితి. గాయపడిన పలువురిని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. గ్రామంలో ఎటువంటి ఉధృత పరిస్థితులు ఘర్షణలు నెలకొనకుండా స్థానిక అశ్వాపురం పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.

**మా హక్కులు కాలరాస్తే ఊరుకునేది లేదు:**

పోడు సాగు గిరిజనులుఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న మా భూముల వద్దకు ఈరోజు అటవీశాఖ అధికారులు వచ్చి ఈ భూమి ఆక్రమణకు గురైంది ఇది అటవీ భూమి అని కందకం కొట్టడం అనేది దారుణమైన విషయమని, మా హక్కులను కాల రాస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకునే ప్రసక్తే లేదని, మేము ఆదివాసులమని మాపై ఇంత చిన్న చూపా అని, ఈ భూమి మా జీవనాధారమని, ఎట్టి పరిస్థితుల్లో కూడా ఈ భూముల్లో కందకాలు కొట్టించే ప్రస్తక్తే



లేదని, మాపై దాడి చేసిన ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని, అవసరమైతే న్యాయ పోరాటానికి సిద్ధమవుతామని, మానవ హక్కుల కమిషన్ కూడా ఫిర్యాదు చేస్తామని ఈ సందర్భంగా గిరిజనులు తెలిపారు.

**ఆదివాసి గిరిజనుల పై దాడి ఘటన ను ఖండించిన ప్రజా సంఘాలు.**

వేములూరు లో జరిగిన ఆదివాసి మహిళా రైతులపై ఫారెస్ట్ అధికారుల దాడిని పలు ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించాయి. మహిళా రైతులను చూడకుండా విచక్షణారహితంగా దాడి చేశారని, మహిళా గిరిజన రైతులపై ఈ విధంగా దాడి చేయటం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించాయి. దాడిలో గాయపడిన ఆదివాసి మహిళా గిరిజన రైతులను వారు పరామర్శించారు. ఉన్నత అధికారులు ఈ సంఘటన కు బాధ్యులైన వారిపై పక్షపాతం లేకుండా చర్య తీసుకోవాలని, లేని పక్షంలో తీవ్రమైన ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

# వర్షాలు తక్కువ.. మెట్ట పంటల వైపు దృష్టి సారించాలి

**శాస్త్రవేత్తల సూచనల ప్రకారం సాగు విధానాలు మార్చుకోవాలి**

**కూసుమంచి మండల పర్యటనలో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి రూ.4.61 కోట్లతో ప్రగతి పనులకు శంకుస్థాపన..**

**కూసుమంచి క్యాంపు కార్యాలయంలో చెక్కుల పంపిణీ..**

**కూసుమంచి, జూలై 18, ప్రభాతవార్త:** ఎలినినో ప్రభావం వల్ల ఈ ఏడాది వర్షాలు తక్కువగా నమోదవుతాయని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రైతాంగం సాంప్రదాయ సాగు మొండిపట్టు వీడి, మారుతున్న ప్రకృతి సవాళ్లకు అనుగుణంగా అప్రమత్తం కావాలి. అధిక నీటి వినియోగం ఉండే పంటల జోలికి వెళ్లకుండా, తక్కువ నీటి అవసరాలతో చేతికొచ్చే ప్రత్యామ్నాయ మెట్ట పంటల వైపే దృష్టి సారించాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. శనివారం పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి మండలంలో మంత్రి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాలను ఉద్దేశించి మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతుల పక్షపాతి అని, ఇప్పటికే ఖరైతు భరోసాఖి అందించి అన్నదాతలకు అండగా నిలిచామని స్పష్టం చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా శాస్త్రవేత్తల సూచనలను పాటిస్తూ సాగు విధానాల్లో మార్పులు చేసుకోవడం అత్యంత ఆవశ్యకమని ఆయన పేర్కొన్నారు.

**రూ.4.61 కోట్లతో ప్రగతి బాట...**

మండల పర్యటనలో భాగంగా మంత్రి పొంగులేటి పలు చోట్ల శంకుస్థాపనలు చేశారు. మల్లాయిగూడెంలో రూ. 2.52 కోట్లతో పెరికసింగారం ఎన్ఎస్పీ కెనాల్ నుంచి భగవాన్ తండా మీదుగా మల్లాయిగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, రూ. 20 లక్షలతో నిర్మించే గ్రామ పంచాయతీ కార్యాలయ భవనానికి భూమిపూజ చేశారు. అనంతరం కోక్యా తండాలో రూ. 1.69 కోట్లతో లింగారం తండా నుంచి లోక్యా తండా ఎన్ఎస్పీ కాలువ వరకు నిర్మించే బీటీ రోడ్డు పనులకు, అగ్రహారంలో రూ. 20 లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవనానికి శంకుస్థాపనలు చేశారు. సంక్షేమ హస్తం.. లబ్ధిదారులకు ఆసరా..కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా సంక్షేమ చెక్కుల పంపిణీ జరిగింది. మండల వ్యాప్తంగా 66 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అదేవిధంగా వివిధ అనారోగ్య కారణాలతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న 111 మంది బాధితులకు రూ. 35.16 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లా రహదారుల ప్రగతికి తుమ్మల చొరవ

**మంత్రి ప్రత్యేక కృషితో రూ.94.50 కోట్ల మంజూరు**

**ఆరు కీలక రహదారుల అభివృద్ధికి పరిపాలన అనుమతులు**

**మంత్రి కోమటిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి తుమ్మల**

**ఖమ్మం బ్యూరో,ప్రభాతవార్త:** ఖమ్మం జిల్లా రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. జిల్లాలోని ఆరు ప్రధాన రహదారుల అభివృద్ధి కోసం మొత్తం రూ.94.50 కోట్లతో పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధుల మంజూరులో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ, నిరంతర కృషి కీలకంగా నిలిచింది. ఖమ్మం నియోజకవర్గ ప్రజలు చాలా కాలంగా ఎదుర్కొంటున్న రహదారుల సమస్యలను మంత్రి తుమ్మల ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరుకు ప్రత్యేకంగా కృషి చేశారు. ఆయన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం రవాణా, రహదారులు భవనాల శాఖ ద్వారా జీవో ఆర్టీ నెం.399 జారీ చేస్తూ పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఈ సందర్భంగా రహదారుల అభివృద్ధికి సహకరించిన రాష్ట్ర రవాణా, రహదారులు భవనాల శాఖ మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అభివృద్ధికి కొత్త ఊపుఅభివృద్ధి చేయనున్న ఈ రహదారులు ఖమ్మం జిల్లాలో వ్యవసాయ, పారిశ్రామిక, పట్టణ ప్రాంతాలను అనుసంధానించే కీలక మార్గాలు. వర్షాకాలంలో దెబ్బతిన్న రహదారుల కారణంగా ప్రజలు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారుల అభివృద్ధితో ప్రయాణ సౌకర్యం మెరుగుపడటమే కాకుండా, రైతులు తమ పంటలను మార్కెట్లకు సులభంగా తరలించే అవకాశం లభించనుంది. జిల్లా ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కూడా ఇది ఎంతో దోహదం చేయనుంది.

**మంజూరైన పనుల వివరాలు**

మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్స్ (ఎండీఆర్) పథకం కింద చేపట్టనున్న పనులు: పండితాపురం – పాపాటపల్లి రహదారి (కి.మీ. 0/0 నుంచి 6/0 వరకు) – ....రూ.16.50 కోట్లు, ఏలేశ్వరం – ఖమ్మం ఆర్ బీ రహదారి మెరుగుదల, జింకలతండా వరకు (కి.మీ. 8/9 నుంచి 10/9 వరకు) – రూ.21.00 కోట్లు ఖమ్మం మున్సిపల్ పరిధిలో మధురానగర్ – కొత్తగూడెం రహదారి (కి.మీ. 0/0 నుంచి 2/6 వరకు) – రూ.15.00 కోట్లు మంచుకొండ – వి.వి.పాలెం రహదారి, గట్టికుంటతండా, మల్లేపల్లి, చింతగుర్తి మీదుగా (కి.మీ. 0/0 నుంచి 8/4 వరకు) – రూ.16.00 కోట్లు పంగిడి – విక్రమ్‌నగర్ రహదారి, ఎన్.వి. బంజారా, రాజబలినగర్ మీదుగా (కి.మీ. 0/0 నుంచి 9/7 వరకు) – రూ.18.00 కోట్లు పీడబ్ల్యూడీ రోడ్డు – వేపకుంట్ల రహదారి, బల్లేపల్లి, బాలకొపేట, చేరువుకమ్ము తండా మీదుగా (కి.మీ. 0/0 నుంచి 5/3 వరకు) – రూ.8.00 కోట్లు ఈ పనుల కోసం మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల పరిధిలోని రహదారులను ఆర్ బీ శాఖకు బదిలీ చేస్తూ, ఆర్థిక శాఖ అంగీకారంతో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో పనుల ప్రారంభం ప్రభుత్వం ఇంజినీర్‌ఇన్‌చీఫ్‌కు తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించడంతో, టెండర్ ప్రక్రియ పూర్తి చేసి త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ఖమ్మం జిల్లాకు రూ.94.50 కోట్ల నిధులు మంజూరు కావడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, జిల్లా అభివృద్ధికి ఇది మరో మైలురాయిగా నిలుస్తుందని అభిప్రాయపడుతున్నారు.

# అంతోటి కనకమ్మ దశదిన కర్మలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

## కుటుంబ సభ్యులను పరామర్శించి కనకమ్మకు నివాళులర్పించిన ఎమ్మెల్సీ తక్కెలపల్లి రవీందర్ రావు

**కామేపల్లి, జూలై 18 (ప్రభాత వార్త):**

కామేపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు అంతోటి అచ్చయ్య తల్లి అంతోటి కనకమ్మ దశదిన కర్మ కార్యక్రమం శనివారంకామేపల్లి లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ తక్కెలపల్లి రవీందర్ రావు హాజరై దివంగత కనకమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతోటి అచ్చయ్యతో పాటు కుటుంబ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కనకమ్మ సాదాసీదా జీవనశైలితో పాటు విలువలను కాపాడిన ఆదర్శ మహిళగాకొనియాడారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని భగవంతుడిని కోరారు. కష్టకాలంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కుటుంబానికి అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ హరిసింగ్ నాయక్, సామ మోహన్ రెడ్డి, కాట్రాల రాంబాబు, శెట్టి శ్రీనివాస్, వడియాల కృష్ణారెడ్డి, మల్లెంపాటి శ్రీనివాసరావు, కన్నమాల రాంబాబు, గండమాల చందర్ రావు, జల్లి రాములు, మేదర శ్రీనివాస్, అంగడాల నరేష్, పుచ్చకాయల బాబు, అజ్మీరా రాజు, కంపసాటి సురేష్, నాగండ్ల లక్ష్మణ్ చౌదరి, గోకర ఉపేందర్, బొంగాని కృష్ణ రమేష్, పెరుగు రాము, అనంతరాములు, గ్రామస్తులు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, మండలవాసులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు. కనకమ్మ మృతి తీరని లోటు అని పేర్కొన్నారు.





# గంగమ్మతల్లి దేవాలయంలో చోరీ హుండీ

## పగలగొట్టి రూ.50 వేలు నగదు అపహరణ

**నేలకొండపల్లి, జూలై 18 (ప్రభాతవార్త):**

భైరవునిపల్లి గ్రామం లోని గంగమ్మతల్లి దేవాలయంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. దేవాలయం హుండీని ఎత్తుకెళ్లి, అందులోని నగదును అపహరించారు. సదరు దొంగలు దేవాలయం



గర్భగుడి తలుపుల తాళాలను కట్టర్లతో కట్ చేసి లోపలికి ప్రవేశించి హుండీని ఎత్తుకొని వెళ్లి కొద్ది దూరం లోని నిర్మానుష్య ప్రదేశంలో హుండీనీ పగలగొట్టారు. భక్తులు సమర్పించిన హుండీలోని దాదాపు రూ.50వేలు నగదు చోరీకి పాల్పడి ఉండవచ్చునని స్థానికులు చెబుతున్నారు. శనివారం తెల్లవారుజామున పొలం పనుల నిమిత్తం వెళ్తున్న ఓ రైతుకు దారిలో పగలగొట్టి ఉన్న హుండీనీ చూసి గ్రామస్తులకు సమాచారం అందించాడు. దేవాలయం హుండీ చోరీ విషయమై ఆలయ కమిటీ వారు నేలకొండపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అత్యధిక మద్యం సేవించిన ఇద్దరికీ 2 రోజులు జైలు శిక్ష

**కొత్తగూడెం లీగల్, జూలై 18 (ప్రభాతవార్త):**

అధికంగా మద్యం సేవించిన ఇద్దరు వ్యక్తులకు జైలు శిక్ష విధిస్తూ కొత్తగూడెం రెండవ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ బి.రవికుమార్ శనివారం తీర్పు చెప్పారు. వివరాలు ఇలా... పూసగూడెం సుబ్బనపల్లి కీ చెందిన పద్దాం నవీన్ అధికంగా 250 శాతం మద్యం సేవించి పాల్వంచ రూరల్ పోలీసులకు గత నెల 29న పెద్దమ్మ గుడి దగ్గర పట్టుబడ్డాడు. పాల్వంచ రూరల్ ఎస్సై బి. సురేష్ కేసు నమోదు చేసుకుని కోర్టులో చార్జీ షీట్ దాఖలు చేశారు. రెండవ కేసులో కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐ జి.ప్రవీణ్ కుమార్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ దగ్గర వాహన తనకి చేయుచుండగా ఇల్లందు లక్ష్మీ నగర్ కు చెందిన బెల్లం మధు కుమార్ అధికంగా 314 శాతం మద్యం సేవించి గత నెల 28న పట్టుబడ్డాడు. ఇద్దరు కోర్టులో నేరము ఒప్పుకున్నందున ఇద్దరికీ రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ జడ్జి గారు తీర్పు చెప్పారు. పాల్వంచ రూరల్ కోర్టు డ్యూటీ ఆఫీసర్ పిపి ఏ .మోహన్ బాబు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ అహ్మద్ పాషా సహకరించారు.

# తక్కువ ధరలో బంగారం పేరుతో రూ.85.70 లక్షలు మోసం చేసిన అంతర్రాష్ట్ర నేరగాళ్లు అరెస్ట్

## కీలక ఆధారాలు స్వాధీనం సింగరేణి సీఐ ఎన్.సాగర్ వెల్లడి

**కామేపల్లి, జూలై 18 (ప్రభాతవార్త):**

కామేపల్లి మండలం లో తక్కువ ధరలో బంగారం పేరుతో రూ.85.70 లక్షలు మోసం చేసిన అంతర్రాష్ట్ర నేరగాళ్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి కీలక ఆధారాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని సింగరేణి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్.సాగర్ శనివారం తెలిపారు. ప్రజలకు తక్కువ ధరలో బంగారం ఇప్పిస్తామని నమ్మబలికి భారీ మొత్తంలో నగదు వసూలు చేసి పరారైన ఇద్దరు అంతర్రాష్ట్ర మోసగాళ్లను అరెస్ట్ చేయడం జరిగిందని తెలిపారు. మండల పరిధిలోని బాసిత్ నగర్ గ్రామానికి చెందిన బానోత్ సాయికుమార్, నారాయణప్ప గురప్ప, ఆనంద రెడ్డి, హరి ప్రసాద్, బోగా లక్ష్మీ నారాయణ బెంగళూరు, కర్నాటక రా ష్ట్రం కు చెందిన వారిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. ప్రధాన నిందితుడు గురప్ప గతంలో వివిధ రాష్ట్రాల్లో ఉద్యోగాలు, భూములు, తక్కువ ధరలో బంగారం ఇప్పిస్తానని చెప్పి మోసాలకు పాల్పడిన చరిత్ర కలిగిన వ్యక్తి అని ఖమ్మం జిల్లాకు వచ్చి బోగా లక్ష్మీ నారాయణ అనే నకిలీ పేరుతో అయ్యప్ప స్వామి మాల ధరించి ఆధ్యాత్మిక వ్యక్తిగా గ్రామాల్లో పరిచయం పెంచు కున్నాడని తెలిపారు. కెప్టెన్ బంజర గ్రామం కేంద్రంగా పూజలు, అన్నదానాలు, పడిపూజలు, శబరిమల యాత్రలు, ఏడు పాయల యాత్రలు వంటి ధార్మిక కార్యక్రమాలు నిర్వహించి ప్రజల విశ్వాసాన్ని సం పాదించాడని అనంతరం తన డ్రైవర్ సహాయకుడైన బానోత్ సాయికుమార్‌తో కలిసి 2026 ఫిబ్రవరి నెల నుండి తక్కువ ధరలో బంగారం ఇప్పిస్తామని చెప్పి ప్రజల వద్ద నుండి భారీ మొత్తంలో నగదు వసూలు చేశాడని వివరించారు. మొదట కొంతమందికి డబ్బులు తిరిగి ఇచ్చి నమ్మకం పెంచి, ఆ తర్వాత పెద్ద మొత్తాల్లో నగదు సేకరించి ఇద్దరూ పరారయ్యారని పేర్కొన్నారు. బాధితులు, మోసపోయిన వారు కామేపల్లి మండలం, పరిసర ప్రాంతాలకు చెందిన 18 మంది బాధితుల నుండి మొత్తం రూ.85,70,000/ వసూలు చేసినట్లు నిందితులు వెల్లడించారని సిఐ సాగర్ తెలిపారు. వసూలు చేసిన డబ్బును అయ్యప్ప పడి పూజలు, అన్నదాన కార్యక్రమాలు, శబరిమల, ఏడుపాయల తదితర యాత్రలు, స్థానిక దేవాలయ ఉత్సవాలు, ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతి ష్ఠ, గ్రామస్తులకు అప్పుల రూపంలో సుమారు రూ.10.50 లక్షలు ఇవ్వడం, విలాసవంతమైన జీవనం, గోవా పర్యటనలు, పాత అప్పులు తీర్చడం వంటి అవసరాలకు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. నిందితులు మైనర్ బాలికను తమ వెంట తీసుకెళ్లిన ఘటనపై కల్లూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలుసుకుని, బాలికను తిరిగి కల్లూరులో దింపి, బాసీత్ నగర్ కు వచ్చి వెళ్తుండగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి వస్తువులను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. కారు, మొబైల్ ఫోన్ లు, బోగా లక్ష్మీ నారాయణ పేరుతో ఉపయోగిస్తున్న నకిలీ ఆధార్ కార్డు ను స్వాధీనం చేసుకోవడం జరిగింద న్నారు. ప్రధాన నిందితుడు గురప్ప కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వివిధ పేర్లతో సంచరిస్తూ ప్రభుత్వ ఉద్యో గాలు ఇప్పిస్తానని, తక్కువ ధరలో భూములు ఇప్పిస్తానని, తక్కువ ధరలో బంగారం ఇప్పిస్తానని చెప్పి అనేక ప్రాంతాల్లో కోట్ల రూపాయల మేర ప్రజలను మోసం చేసినట్లు విచారణలో వెల్లడైందన్నారు. గతంలో జైలు శిక్ష కూడా అనుభవించినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. ప్రజలు తక్కువ ధరలో బంగారం, భూములు, ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే వ్యక్తులను నమ్మి డబ్బులు ఇవ్వకూడదని, అలాంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా ఆఫర్లు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సిఐ సాగర్ కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో నేరగాళ్ల అరెస్టు వివరాలను సిఐ సా గర్ వెల్లడించిన ఈ కార్యక్రమంలో కామేపల్లి ఎస్సై పి.శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# నేరాలు-దారుణాలు



# బంగారం కోసం వృద్ధురాలి హత్య..?

## పిండిప్రోలులో అర్ధరాత్రి దారుణం

### దుండగులను వెంటనే పట్టుకోవాలంటూ జాతీయ రహదారిపై రాస్తారోకో

### పోలీసుల నిర్లక్ష్యమే వరుస నేరాలకు కారణమంటూ గ్రామస్థుల ఆగ్రహం

**తిరుమలాయపాలెం, జూలై 18 (ప్రభాతవార్త):**

ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామంలో శనివారం అర్ధరాత్రి జరిగిన వృద్ధురాలి హత్య కలకలం రేపింది. బంగారు ఆభరణాల కోసం ఇంట్లోకి చొరబడిన దుండగులు ప్రతిఘటించిన వృద్ధురాలిని అత్యంత దారుణంగా హత్య చేసినట్లు ప్రాథమికంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వరుస దొంగతనాలు జరిగినప్పటికీ నిందితులను పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని ఆరోపిస్తూ గ్రామస్థులు ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించి ఆందోళనకు దిగారు.

### తలుపు తీయగానే దాడి

గ్రామానికి చెందిన చెన్న సుగుణమ్మ (66) తన భర్త జనార్దన్‌తో కలిసి నివాసముంటోంది. జనార్దన్ పక్షవాతంతో మంచానికే పరిమితి కాగా, సుగుణమ్మ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం వంటమనిషిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. పెద్ద కుమారుడు మృతి చెందగా, చిన్న కుమారుడు విద్యుత్ శాఖలో ఉద్యోగం చేస్తూ సత్తుపల్లిలో నివసిస్తున్నాడు. ఇద్దరు కుమార్తెలు సూరత్‌లో స్థిరపడ్డారు. శనివారం అర్ధరాత్రి సమయంలో ఇంటి తలుపులు కొట్టడంతో బయట ఎవరో వచ్చారని భావించిన సుగుణమ్మ తలుపు తెరిచింది. వెంటనే ఇంట్లోకి చొరబడిన దుండగుడు ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కునేందుకు ప్రయత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో వెంట తెచ్చుకున్న పదునైన ఆయుధంతో కుడి కనత భాగంపై బలంగా దాడి చేశాడు. తీవ్ర రక్తస్రావంతో సుగుణమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మంచానికే పరిమితమైన భర్త జనార్దన్ ఏమీ చేయలేని పరిస్థితిలో ఉండిపోయాడు.

### బంగారం కోసమే హత్య..?

మృతురాలు మెడలో బంగారు ఆభరణాలు ధరించి ఉండటంతో వాటిని దోచుకునే ప్రయత్నంలోనే హత్య జరిగి ఉంటుందని గ్రామస్థులు అనుమానిస్తున్నారు. సంఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీం సహాయంతో ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కుమారుడు చలపతిరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

### తొమ్మిది నెలల్లో నాలుగో దొంగతనం

పిండిప్రోలు గ్రామంలో గత తొమ్మిది నెలలుగా వరుస దొంగతనాలు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే గ్రామంలో ఇప్పటికే మూడు చోరీలు జరిగాయని, ప్రధాన రహదారిపై ఉన్న ఓ ఇంట్లో సుమారు 20 తులాల బంగారం దోచుకెళ్లిన ఘటనలోనూ ఇప్పటి వరకు నిందితులను పోలీసులు పట్టుకోలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పుడు వృద్ధురాలి హత్య జరగడం గ్రామస్థులను తీవ్ర భయాందోళనకు గురి చేసింది.

హైవేపై రాస్తారోకో

పోలీసుల నిర్లక్ష్య వైఖరే నేరస్తులకు ధైర్యం ఇస్తోందని ఆరోపిస్తూ గ్రామస్థులు పెద్దఎత్తున ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. హత్య చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిందితులను పట్టుకునే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు.

### ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టాలి

మండలంలో వరుసగా దొంగతనాలు, హత్యలు, ఇతర నేరాలు పెరుగుతున్నా పోలీసులు సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామాల్లో పేకాట, గంజాయి వంటి అక్రమ కార్యకలాపాలు పెరిగి యువతను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించి, వరుస నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితులను వెంటనే అరెస్టు చేయాలని జిల్లా పోలీసు ఉన్నతాధికారులను గ్రామస్థులు కోరుతున్నారు.








# దుమ్ముగూడెం పిహెచ్‌సి అప్ గ్రేడ్ చేయాలి

## ఆసుపత్రిలో మరో ఇద్దరు వైద్యుల నియామకం చేపట్టాలి

దుమ్ముగూడెం ప్రభాతవార్త :

దుమ్ముగూడెం పిహెచ్సి లో మరో ఇద్దరు వైద్యుల నియామకాన్ని చేపట్టాలని ఆసుపత్రిని అప్గ్రేడ్ చేయాలని 50 పడకల ఆసుపత్రిగా నిర్మించాలనీ సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కారం పుల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు సిపిఎం పార్టీ దుమ్ముగూడెం మండల కమిటీ ఆధ్వర్యంలో దుమ్ముగూడెం పిహెచ్సి ని శనివారం సందర్శించారు ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు అనంతరం కారం పుల్లయ్య మాట్లాడుతూ 24 గంటలు



ఆసుపత్రిగా పనిచేస్తున్న దుమ్ముగూడెం పిహెచ్సి లో ఒక్కరే వైద్యులు ఉన్నారని మరో ఇద్దరు వైద్యుల నియామకాన్ని చేపట్టి ఏజెన్సీ ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు అలాగే ఆసుపత్రిలోని సిబ్బంది కొరత ఉందని వాటిని కూడా భర్తీ చేయాలన్నారు దుమ్ముగూడెం మండలంలో అత్యవసర వైద్య చికిత్సల కోసం ఏజెన్సీ వాసులు దుమ్ముగూడెం పిహెచ్సి ని ఆశ్రయిస్తారని అటువంటి పీహెచ్సీలో ఒక్కరే వైద్యుడు ఉండటం వల్ల పూర్తిస్థాయిలో ప్రజలకు వైద్యం అందట్లేదన్నారు అలాగే మండలంలో ఎవరైనా ప్రమాదవశాత్తు మృతి చెందితే పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం తరలించాల్సి వస్తుందని దుమ్ముగూడెం పి హెచ్ సి లో మృతదేహాలకు పోస్ట్ మార్టం నిర్వహించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారుఈ కార్యక్రమంలో యలమంచి వంశీకృష్ణ మర్మం చంద్రయ్య కొరస చిలకమ్మ యలమంచి శ్రీనుబాబు బొల్లి సత్యనారాయణ మడకం మహేంద్రనాథ్ పలువురు సిపిఎం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ఆదివాసి మహిళకు న్యాయం చేయాలి

దుమ్ముగూడెం ప్రభాతవార్త :



దుమ్ముగూడెం క్రాస్ రోడ్డు వద్ద ఎన్నో సంవత్సరాలుగా ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఉంటున్న ఆదివాసి మహిళకు న్యాయం చేయాలని ఏ వి ఎస్ పి జిల్లా అధ్యక్షుడు సోంది మల్లుదొర విజ్ఞప్తి చేశారు గత ఎన్నో సంవత్సరాలు క్రితం ఆ కుటుంబ సభ్యుల జీవనోపాధికి ప్రభుత్వం భూమిని ఇచ్చిందని ఇచ్చిన భూమిని రెవెన్యూ అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు నిరుపేద కుటుంబానికి చెందిన ఆ మహిళకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# రైతులు ప్రత్యామ్నాయ పంటలు పై దృష్టి సారించాలి

బూర్గంపహాడ్ , ప్రభాతవార్త:




ఎల్ ని నో వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులు దీర్ఘకాలిక పంటలు కాకుండా ప్రత్యామ్నాయ పంటలు వేసుకుంటే మంచిదని కృషి విజ్ఞాన కేంద్రం ప్రతినిధి భరత్, ఎ డి ఎ తాతారావులు రైతులకు సూచించారు. సోంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో రైతు గాదె నర్సిరెడ్డి వరి పొలం వద్ద శనివారం భద్రాద్రి కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్ర బృందం, వ్యవసాయ శాఖ అధికారులు ఎల్ నినో వాతావరణ పరిస్థితులు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులను కలియ దున్నటం వల్ల సేంద్రీయ కర్బనం ఏర్పడి అధిక దిగుబడి రావడంతో పాటు తెగుళ్లు చీడపీడల నుండి పంటకు విముక్తి కలుగుతుందని అన్నారు. ఎల్ నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది లోటు వర్షపాతం నమోదయినట్లు తెలిపారు. జిల్లాలో అత్యధికంగా వరి, పత్తి మొక్కజొన్న సాగు చేస్తున్నట్లు తెలిపారు.రైతులు వాతావరణ పరిస్థితులు గమనించి దీర్ఘకాలిక పంటలను సాగు చేయొద్దని హెచ్చరించారు. ముఖ్యంగా వరి నాటకపోవడమే మంచిదని వ్యాఖ్యానించారు. ప్రాజెక్టుల్లో సైతం నీటి నిల్వలు తక్కువగా ఉండటంతో రాబోయే రోజుల్లో విద్యుత్ సమస్యలు ఏర్పడతాయని ప్రత్యామ్నాయ పంటలు కంది, పెసర , బొబ్బర మొదలగు స్వల్పకాలిక పంటలు,వెదజల్లే పంటలను సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో శంకర్, ఏ ఈ ఓ లు పవన్, వైష్ణవి రైతులు పాల్గొన్నారు.

# నేడు మంత్రి పొంగులేటి పర్యటన

సారపాక, ప్రభాతవార్త:

రాష్ట్ర గృహ నిర్మాణ, పౌర సమాచార, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నేడు బూర్గంపహాడ్ మండలంలో పర్యటించనున్నారని ఎంపీడీవో జమలారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని మొరంపల్లి బంజర గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలలో మంత్రి పాల్గొంటారని అన్నారు. అనంతరం గంటలకు పినపాక పట్టి నగర్ గ్రామపంచాయతీ నుండి ఒడ్డుగూడెం వరకు చేపట్టిన రహదారి పనులకు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు కూడా పాల్గొంటారని తెలిపారు.

# విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

దుమ్ముగూడెం ప్రభాతవార్త :




టీం సంభవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీతానగరం ఎంపీపీఎస్ పాఠశాలకు చెందిన 55 మంది విద్యార్థులకు బ్యాగులను జామెట్రీ బాక్సులు నోట్సులు పెన్ను పెన్సిల్స్ పంపిణీ చేశారు స్థానిక సర్పంచ్ వాగే ఖాదర్ బాబు దుమ్ముగూడెం ఎంఈఓ సున్నం సమ్మయ్య చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మారుమూల ఏజెన్సీ ప్రాంతంలోని విద్యార్థుల చదువుకు కావలసిన వసతులను కల్పించడం ఎంతో అభినందనీయమని వారు ఉన్నత స్థాయి ఎదుగుదలకు అవసరమైన తోడ్పాటును అందిస్తున్న ఫౌండేషన్ ను విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటారని అన్నారు పర్ణశాల సర్పంచ్ గారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని పేదలకు సేవ చేయాలనే తపన ఎంతో గొప్పదని అటువంటి గొప్ప మనస్సున్న టీం సంభవ ఫౌండేషన్ కు అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. సౌందర్య వేణి ఫౌండేషన్ వాలంటీర్ శ్రీలత ఏజె ప్రభాకర్ పాఠశాల చైర్మన్ పూనెం జోగమ్మ ఉపాధ్యాయుడు కృష్ణార్జునరావు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు

# విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలి

## పేరెంట్స్ కమిటీ మీటింగ్ లో తల్లిదండ్రులకు ఉపాధ్యాయుల వినతి

దుమ్ముగూడెం ప్రభాతవార్త :



దుమ్ముగూడెం మండలం నరసాపురం గ్రామంలోనున్న సూది రెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం జరిగింది ఈ సందర్భంగా పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు సోయం కృష్ణ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుండి 10వ తరగతి పరీక్షలలో 100!! ఫలితాలు సాధిస్తున్నామని ఈ సంవత్సరము కూడా ముందస్తు ప్రణాళికతో మంచి ఫలితాలు సాధిస్తామని తల్లిదండ్రులకు తెలిపారు విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని ఇంటివద్ద పిల్లలను సెల్ఫోన్లకు దూరంగా ఉంచాలని నిరంతరం పిల్లలను పర్యవేక్షి స్తూ పాఠశాలకు సక్రమంగా పంపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు తల్లిదండ్రులు కూడా తమ తమ అభిప్రాయాలను తెలియజేస్తూ పిల్లలు పురోభివృద్ధికి తప్పకుండా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని పాఠశాల ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు చివరగా తల్లిదండ్రులతో పిల్లలను సక్రమంగా పాఠశాలకు పంపిస్తామని ప్రతిజ్ఞను చేయించారు ఈ కార్యక్రమంలో పాఠశాలలోని ఉపాధ్యాయులు బొర్రయ్య సిహెచ్ అనిల్ కుమార్ పివి.రమణ చిలకమర్రి శ్రీనివాసు పి తిరుపతిరావు జి. వి. వి. యస్.స్వామి పి. డి. కేజియా తదితరులు పాల్గొన్నారు

# రామయ్య నిత్య కల్యాణ వేడుక

## శనివారం బేడా మండపంలో శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణ మహోత్సవం

## - భక్తుల సందడితో మార్మోగిన భద్రాద్రి

భద్రాచలం కల్చరల్ , ప్రభాతవార్త జూలై 18:



భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో శనివారం నిర్వహించిన నిత్య కల్యాణ మహోత్సవం ఆధ్యాత్మిక శోభతో అంగరంగ వైభవంగా జరిగింది. "జై శ్రీరామ్" నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగగా, ఉత్సవమూర్తుల దివ్య కల్యాణాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.ఉదయం మూలమూర్తులకు అభిషేకాలు నిర్వహించి విశేష పుష్పాలంకరణ చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను శోభాయాత్రగా బేడా మండపానికి తీసుకువచ్చి ఆగమ శాస్త్ర విధానాల ప్రకారం నిత్య కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఆలయ అర్చకులు సంకల్పం, మంగళాష్టకాలు, తలంబ్రాలు, మంగళసూత్ర ధారణ తదితర కల్యాణ క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అక్షి ంతలు అందజేశారు.జై శ్రీరామ్ నినాదాలతో ఆలయ ప్రాంగణం భక్తిరసంలో మునిగిపోయింది

# ఏఎస్ఐ శంకర్ కుమారుడి మృతికి ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు నివాళి

భద్రాచలం క్రైమ్, ప్రభాతవార్త:

భద్రాచలంలో ట్రాఫిక్ ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శంకర్ కుమారుడు హరీష్ శనివారం అనారోగ్యంతో మృతిచెందడం తీవ్ర విషాదానికి గురి చేసింది. హరీష్ మృతికి పోలీస్ ఉన్నతాధికారులు, తోటి ఉద్యోగస్తులు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, ప్రముఖులు నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు హరీష్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం శంకర్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే, హరీష్ మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారికి తన పూర్తి అండదండలు ఉంటాయని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అరికెల్ల తిరుపతిరావు, భీమవరపు వెంకటరెడ్డి, పట్టణ ప్రముఖులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొని హరీష్‌కు నివాళులర్పించారు.



## దివంగత ఉపాధ్యాయులు ఈసం రవి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

గుండాల జూలై 18 ప్రభాతవార్త : తెలంగాణ గిరిజన గురుకుల పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులు !! అధ్యాపకుల యూనియన్ ( గ్లాటా) పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, అధికారులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, శ్రేయోభిలాషులు స్వచ్ఛందంగా అందించిన విరాళాల ద్వారా సేకరించిన రూ.88,000/ ను శనివారం దివంగత ఉపాధ్యాయులు ఈసం రవి పెద్దకర్మ సందర్భంగా హాజరై కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా గ్లాటా రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఆర్. రామారావు , ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు వెంకన్న , ఉమ్మడి ఖమ్మం జిల్లా జనరల్ సెక్రటరీ కటుకూరి కృష్ణయ్య, జిల్లా బాధ్యులు జి. రామనాధం లు ఈసం రవి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయ కులు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న సహోద్యోగి కుటుంబానికి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గురుకుల కుటుంబం స్పందించి, మానవత్వాన్ని చాటుతూ స్వచ్ఛందంగా విరాళాలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సహాయ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్క ప్రిన్సిపాల్, వైస్



ప్రిన్సిపాల్, అధికారి, ఉపాధ్యాయుడు, అధ్యాపకుడు, బోధనేతర సిబ్బంది మరియు శ్రేయోభిలాషికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు."ఆపదలో అండగా నిలవడం మానవత్వానికి గొప్ప నిదర్శనం.""మనందరి చేయూత... ఒక కుటుంబానికి జీవితాంతం భరోసా. అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగుతామని భరోసా ఇచ్చారు.దేవన్ బాబు ,బుచ్చయ్య , అశోక్ , వెంకటేశ్వర్లు , కాంతారావు , రాములు , రాజశేఖర్ , లోకనాథ్ , రాజేందర్ , కల్లీ లక్ష్మణ్ , ప్రవీణ్ , రాము , నెహ్రూ, దమ్మపేట పాఠశాల ప్రిన్సిపాల్ దమ్మపేట పాఠశాల ప్రిన్సిపాల్ పి. వీరస్వామి , కిన్నెరసాని కళాశాల ప్రిన్సిపల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి సేవించిన ముగ్గురు వ్యక్తులు పట్టివేత.

ఖమ్మం క్రైమ్ ప్రభాతవార్త. ఖమ్మం నగరంలో శనివారం ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది మున్నేరు బ్రిడ్జి కింద, ప్రకాష్ నగర్, ఖమ్మంలో నిర్వహించిన తనిఖీలలో అనుమానాస్పద స్థితిలో ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారని త్రీటౌన్ సిఐ తెలిపారు. కరీంనగర్ గాంధీ రోడ్ కు చెందిన పసుల సూర్యనారాయణ, కదను రాకేష్, మైదం మల్లేష్, తిప్పన్నపేట గ్రామం, జగిత్యాల జిల్లా. వీరిని విచారించగా సిగరెట్‌లో గంజాయి నింపి సేవించినట్లు అంగీకరించారు. అనంతరం ఇద్దరు మధ్యవర్తుల సమక్షంలో వారి మూత్ర నమూనాలను ఇంటిగ్రేటెడ్ న్యూస్ట్రిప్ కీ కప్ యూరిన్ టెస్ట్ కిట్ ద్వారా పరీక్షించగా, గంజాయి సేవించినట్లు పాజిటివ్ ఫలితాలు వచ్చాయి.దీంతో చట్టపరమైన నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి, గౌరవ న్యాయస్థానం ఆదేశాల మేరకు ఖమ్మం ప్రభుత్వ హాస్పిటల్ లోని డి అడిక్షన్ సెంటర్ కు తరలించనైనది.ఖమ్మం పోలీసుల విజ్ఞప్తి: మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుంది. గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, రవాణా వంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయి. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్ 100 / 112కు సమాచారం అందించాలని ఖమ్మం పోలీసులు కోరుతున్నారు.

## ఇంటి పన్ను కడుతుంటే.. మళ్లీ చెత్త పన్ను ఎందుకు?

### అదనపు సెస్ వసూళ్లను నిలిపివేయాలని 19వ వార్డు కౌన్సిలర్ పింగళి అనూహ్య నరేష్ డిమాండ్



ఇల్లందు, జూలై 18, ప్రభాతవార్త: ఇంటి పన్ను చెల్లిస్తున్న ప్రజలపై చెత్త సేకరణ పేరుతో అదనపు సెస్ విధించడం అన్యాయమని ఇల్లందు మున్సిపాలిటీ 19వ వార్డు కౌన్సిలర్ పింగళి అనూహ్య నరేష్ మండిపడ్డారు. మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డుల ప్రజల నుంచి రూ.50, రూ.100, రూ.200 చొప్పున అదనంగా వసూలు చేయడం మున్సిపల్ నిబంధనలకు విరుద్ధమని ఆరోపించారు.శనివారం వారు మాట్లాడుతూ, ప్రతి ఇంటి నుంచి చట్టబద్ధంగా ఇంటి పన్ను వసూలు చేస్తున్నప్పుడు పారిశుధ్య నిర్వహణ బాధ్యత పూర్తిగా మున్సిపాలిటీదేనని అన్నారు. అలాంటప్పుడు చెత్త సేకరణ పేరుతో మరోసారి ప్రజలపై అదనపు ఆర్థిక భారం మోపడం సమంజసం కాదని విమర్శించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ కు వివరిస్తూ, ప్రతి ఏడాది ప్రజలు చెల్లిస్తున్న ఇంటి పన్ను నిధులు ఎక్కడ ఖర్చు అవుతున్నాయి? పారిశుధ్య నిర్వహణకు ఆ నిధులను ఎందుకు వినియోగించడం లేదు? పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం వేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు.ప్రజలపై భారం మోపుతున్న ఈ అదనపు సెస్ వసూళ్లను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజలతో కలిసి మున్సిపల్ కార్యాలయాన్నిముట్టడించడంతో పాటు న్యాయపరమైన పోరాటం కూడా చేపడతామని హెచ్చరించారు.

## పోలీసుల వాహన తనిఖీలో గంజాయి స్వాధీనం

### ముగ్గురు వ్యక్తులు అరెస్ట్, కేసు నమోదు



జూలూరుపాడు, ప్రభాతవార్త, జూలై 18: మండల పరిధిలోని తల్లాడ, కొత్తగూడెం ప్రధాన రహదారిపై శనివారం స్థానిక పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా గంజాయి పట్టుబడింది. పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ జీనత్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో అనుమానాస్పదంగా ఉన్న మహేంద్ర జైలో వాహనాన్ని పోలీసులు ఆపి పరిశీలించారు. తనిఖీ చేయగా వాహనంలో ప్రయాణిస్తున్న వికాస్ మండల్, త్రినాథ్ బిసోయి, గణేష్ ముదులి అనే ముగ్గురు వ్యక్తుల వద్ద 100 గ్రాముల చొప్పున మూడు ప్యాకెట్ల డ్రై గంజాయి లభ్యమైంది. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.5,000గా అంచనా వేశారు. నిందితుల వద్ద నుండి గంజాయిని పంచుల సమక్షంలో చట్టబద్ధంగా స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అనంతరం నిందితులపై నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రాఫిక్ సబ్స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) చట్టం కింద సంబంధిత నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వ మరియు వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఏదైనా తెలిసిన వెంటనే తెలియజేసి పోలీసులకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## రమణమూర్తిపై దాడి ఘటనను ఖండిస్తూ నిరసన



ఇల్లందు అర్బన్, జూలై 18, ప్రభాతవార్త: ఇల్లందులో విజయ్ విహారం రమణమూర్తిపై జరిగిన దాడిని ఖండిస్తూ పలు ప్రజాసంఘాల నాయకులు శనివారం శాంతియుత నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. దాడికి పాల్పడిన కేశవు రెడ్డిని వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రమణమూర్తి ఒక టెలివిజన్ చర్చలో పత్రికలో ప్రచురితమైన వార్తా కటింగ్‌ను చూపిస్తూ మాట్లాడుతున్న సమయంలో ఆయనపై దాడి జరగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ భౌతిక దాడులకు పాల్పడటం ఏ మాత్రం సమర్థనీయం కాదని పేర్కొన్నారు.దాడి ఘటనపై కేసు నమోదైనప్పటికీ నిందితుడిని ఇప్పటివరకు అరెస్టు చేయలేదని ఆరోపిస్తూ, పోలీసులు వెంటనే స్పందించి నిందితుడిని అదుపులోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో జై భారత్ బీసీ పోరాట వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెలిమిచెట్టి వీరన్న, ఎన్. మోహన్‌రావు, టి. శ్రీనివాసరావు, ఎం. వసంతరావు, ఆర్.బి.జె. రాజు, దానసరి రామ్మూర్తి, కె. సుధీర్, నాగేశ్వరరావు, కేవీపీఎస్ నాయకుడు వెంకటేశ్వరరావు, నరసయ్య, కౌసల్య, జి. వెంకన్న పాల్గొన్నారు.

## సింగరేణిలో తాడిచర్ల-2 బ్లాక్ సాధన విజయోత్సవాలు

కొత్తగూడెం, జూలై 18 ప్రభాతవార్త: సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయింపును పురస్కరించుకుని శనివారం సింగరేణి ప్రధాన కార్యాలయం, మెయిన్ వర్క్‌షాప్, సెంట్రల్ వర్క్‌షాప్, సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో విజయోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి జీఎం (పర్సనల్, వెల్ఫేర్ సీఎస్ఆర్) జి.వి. కిరణ్ కుమార్ అధ్యక్షత వహించగా, డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ, డైరెక్టర్ (పి పి) కే. వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మెయిన్, సెంట్రల్ వర్క్‌షాప్‌లలో జరిగిన కార్యక్రమాలకు డైరెక్టర్ (ఈ ఎం) ఎం. తిరుమలరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చొరవతో పాటు సింగరేణి సిఎండీ బుద్ధ ప్రకాశ్ జ్యోతి నాయకత్వ ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌ను మైనింగ్ లీజ్ మంజూరు చేసిందన్నారు. తాడిచర్ల-2 బ్లాక్‌లో సుమారు 430 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని, సంవత్సరానికి 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉందన్నారు. ఈ గనికి సుమారు 40 ఏళ్ల ఆయుష్షు ఉండటంతో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 2 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. గత పదేళ్లలో సింగరేణికి కొత్త గనులు కేటాయించని నేపథ్యంలో వేలంలో పాల్గొనకుండానే తాడిచర్ల-2 బ్లాక్ లభించడం శుభపరిణామమన్నారు. ఇదే తరహాలో పెండింగ్‌లో ఉన్న ఇతర బొగ్గు బ్లాకులను కూడా సింగరేణికే కేటాయిస్తే సంస్థ భవిష్యత్తు మరింత బలోపేతమవుతుందని అభిప్రాయపడ్డారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సందేశాన్ని ఉద్యోగులకు వినిపించి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## హామీలకే పరిమితమైన పెన్షన్ పెంపు?వృద్ధుల ఆవేదనను ఆలకించరా?

టేకులపల్లి, ప్రభాతవార్త తెలంగాణ ముఖ్య మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయకముందే ఆరు గ్యారంటీల పథకాల్లో భాగంగా వృద్ధాప్య పెన్షన్‌ను రూ. 4,000/ లకు పెంచుతామని ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేరకపోవడం తీవ్ర విచారకరమని ఏజెన్సీ షెడ్యూల్ కులాల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ మీసాల రాములు ఆవేదన వ్యక్తం చేశారు. నాడు నెల రోజుల్లోనే పెంచిన పెన్షన్ డబ్బులను లబ్ధిదారుల ఖాతాల్లో వేస్తామని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి, నేటికీ ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం వృద్ధులను, సమాజాన్ని వంచించడ మేనని ఆయన దుయ్యబట్టారు. కాలం గడుస్తున్నా మాట నిలబెట్టుకోకపోవడం వల్ల క్షేత్ర స్థాయిలో పెన్షన్ దారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందు లకు గురవుతున్నారని, ప్రభుత్వ నిర్లక్ష్యం వారి జీవనభృతిని భారంగా మార్చిం దని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా కళ్ళు తెరిచి తన ఉదాసీన వైఖరిని వీడాలని, వృద్ధుల పట్ల కరుణతో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, ఇచ్చిన మాట ప్రకారం తక్షణమే పెన్షన్ మొత్తాన్ని రూ. 4,000/ లకు పెంచి పెన్షన్ దారుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. సమాజంలో అత్యంత ఆదరణ కోరుకునే వృద్ధుల విషయంలో ప్రభుత్వం తన బాధ్యతను సకాలంలో నిర్వర్తించకపోతే లబ్ధిదారుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నయి

# వనమహోత్సవం - భారీ స్థాయిలో మొక్కల నాటుడు



**పాల్వంచ టౌన్,జూలై 18,ప్రభాత వార్త:**
పాల్వంచ శ్రీనివాసగిరి లోని శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం (గుట్ట) ఆవరణలో శనివారం వన మహోత్సవ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది.శ్రీనివాసగిరి భక్త సమాజ మండలి మరియు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా రెండు రోజుల పాటు సుమారు 5,000 మొక్కలను నాటాలని నిర్ణయించారు.మొదటి రోజు జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని మొక్కలు నాటడంలో భక్తులకు సహకరించారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ,గతంలో వర్షాకాలంలో రోజూ ఆహ్లాదకరంగా వర్షాలు కురిసేవని, కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ఒక్కరోజు వర్షం కోసం ఎదురుచూసే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో ఆధ్యాత్మికంతో పాటు పర్యావరణ పరిరక్షణ బాధ్యతను గుర్తించి,భక్త సమాజం వనమహోత్సవం ద్వారా మొక్కలు నాటడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇటువంటి పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ సహకరిస్తుందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో అతిథులతో పాటు శనివారం స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులు కూడా పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులలో కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేశ్,పాల్వంచ ఎఫ్డిఓ కృష్ణ ప్రసాద్,డిఎస్పీ సతీశ్ కుమార్, తహసీల్దార్ దారా ప్రసాద్,అటవీ రేంజర్ సురేశ్,కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి తదితరులు ఉన్నారు. జిల్లా కార్యదర్శి షాబిర్ పాషా, సేవా ట్రస్ట్ చైర్మన్ కొత్త వెంకటేశ్వర్లు,అధ్యక్షులు డా.బిక్కసాని సుధాకర్ రావు,ప్రధాన కార్యదర్శి ఆరుట్ల లక్ష్మణ చార్యులు,ట్రస్ట్ సభ్యులు చేరుకూరి శివ పార్వతి,కౌన్సిల్ సభ్యులు జమ్ముల సీతారామ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు తోలేటి నగేష్ కుమార్ శర్మ,అర్చకులు ఆరుట్ల ఫణి రాజ చార్యులు,భక్త సమాజ మండలి అధ్యక్షులు ఊకే భద్రయ్య, కార్యదర్శులు తాటికొండ శ్రీలత, సలహాదారులు వంకదారు నరసింహ కుమార్, ఉపాధ్యక్షులు చనుమోలు శ్రీనివాస రావు, కార్యనిర్వాహక అధ్యక్షులు కందుకూరి రామకృష్ణ,బండి నారాయణ,ఉప కోశాధికారి ధనుకోటి వెంకటేష్, సాంస్కృతిక కార్యక్రమాల కార్యదర్శి బళ్ళమూడి విజయలక్ష్మి, సేవాదళ్ అధ్యక్ష, కార్య దర్శులు కొండ్రు శివ,పరిశిక కిరణ్,మహిళా సంఘం కార్యదర్శులు రేనాటి స్రవంతి,ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్సిసి విద్యార్థినీ, విద్యార్థులు, గిరిజన సంక్షేమ వసతి డిగ్రీ కళాశాల విద్యార్థినులు,తదితరులు పాల్గొన్నారు. ఆదివారం కూడా ఈ వనమహోత్సవ కార్యక్రమం కొనసాగనుందని, భక్తులు,ప్రజలు అందరూ రెండవ రోజు కూడా పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# ఏరియాలో తాడిచర్ల-2 బ్లాక్ సాధన విజయోత్సవ సంబురాలు



**రుద్రంపూర్, జూలై 18 ప్రభాతవార్త:**
తాడిచర్ల2 బొగ్గు బ్లాక్‌కు మైనింగ్ లీజు మంజూరు కావడం సందర్భంగా నిర్వహిస్తున్న విజయోత్సవాల సందర్భంగా కొత్తగూడెం ఏరియా లో గల అన్నీ మైన్స్ / డిపార్ట్మెంట్ లలో శనివారం ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేమ్ రాజు ముఖ్య అతిథిగా హాజరై సింగరేణి ఉద్యోగులకు అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తాడిచర్ల2 బ్లాక్ సాధన సింగరేణి సంస్థ భవిష్యత్తుకు ఎంతో కీలకమైన మైలురాయిగా నిలుస్తుందని జియం గారు పేర్కొన్నారు. ఈ విజయోత్సవం మన సంస్థ అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి ప్రతి ఉద్యోగి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయం మరియు అన్ని గనులు మరియు డిపార్ట్మెంట్ లలో తాడిచర్ల-2 బ్లాక్ కేటాయింపు విజ యోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ స్వీట్లు పంపిణీ చేసి తాడిచర్ల2 బ్లాక్ సాధన పట్ల తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సందేశంతో కూడిన కరపత్రాలను ఉద్యోగులందరికీ పంపిణీ చేశారు. నంతరం ఉప ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపిస్తూ, తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ మైనింగ్ లీజు సాధనతో సింగరేణి సంస్థకు సుస్థిర భవిష్యత్తు లభించిందని, సంస్థ అభివృద్ధి, కార్మిక సంక్షేమం, కొత్త బొగ్గు గనుల సాధన, ఉత్పత్తి వ్యయ నియంత్రణ, సాంకేతిక అభివృద్ధి, పునరుత్పాదక ఇంధన రంగంలో విస్తరణ వంటి అంశాలపై ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉద్యోగులకు వివరించారు. అనంతరం నిర్వహించిన విజయోత్సవ వేడుకల్లో అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు ఒకరికి ఒకరు స్వీట్లు, మిఠాయిలు తినిపించుకుంటూ వేడుకలను ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఆన్ని గనులు, విభాగాలలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడము జరిగినది. ఏరియా జీఎం ఎం. షాలెమ్ రాజు వికెసీఎం, జీఎం కార్యలయం నందు నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో వికెసీఎం ప్రాజెక్టు ఆఫీసర్ ఎంవి. నరసింహరావు, ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి మల్లికార్జున్ రావు, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, ఎస్వోటు జీఎం ఎం గోవిందరావు, పర్సనల్ మేనేజర్ ఎల్.తిరుపతి, ఏరియా ఇంజినీర్ వి.రామకృష్ణ, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మొక్కపాటి వెంకటేశ్వర్లు, డిజిఎం (ఐఈడి) యోహాన్ , ఇన్‌చార్జ్ హెచ్ఓడీ (సివిల్) కె. రాజారాం, డివైపిఎం హరీష్, ఏఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ గట్టయ్య, ఏఐటియుసి ఫిట్ సెక్రటరీ సౌజన్య, ఐఎన్టియుసి ఫిట్ సెక్రటరీ సాగర్, అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, సూపర్వైజర్లు మరియు ఉద్యోగులు పాల్గొన్నారు.

# కుటుంబ ఆరోపణలపై కేటీపీఎస్ డివిజనల్ ఇంజనీర్ భూక్య పుల్యా వివరణ.

**పాల్వంచ టౌన్,జూలై 18,ప్రభాత వార్త:**
నాపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలని, కన్న తల్లిదండ్రులను చూసుకోవడం తన బాధ్యత అని కేటీపీఎస్ డివిజనల్ ఇంజనీర్ భూక్య పుల్యా అన్నారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కావాలనే కుటుంబ సభ్యులు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇంటి వివాదంపై స్పష్టీకరణ:ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ట కోసం ఇంటిని శుభ్రం చేసుకోవడానికి పక్క గదిలోకి వెళ్లాలని తల్లిదండ్రులను సూచించానని, అయితే తాను వారిని బయటకు పంపలేదని పుల్యా వివరించారు.ప్రస్తుతం తల్లిదండ్రులు ఉంటున్న ఇంటిని 2003లో తన అత్తమామలు కట్నం కింద ఇచ్చారని, అప్పటి పరిస్థితుల్లో తన తండ్రి పేరిట పెద్దల సమక్షంలో బాండ్ పేపర్ రాసుకున్నామని తెలిపారు.ఆస్తి వివాదం:అప్పటి నుంచి ఉమ్మడి కుటుంబంగా అందరం కలిసి ఉన్నామని,2020లో తన పేరిట ఉన్న ఇంటి పేపర్లను కుటుంబ సభ్యులు తమ ఇష్టపూర్వకంగా బాండ్ పేపర్ రాసిచ్చారని,అప్పటి నుంచి నేటి వరకు తల్లిదండ్రులు ఆ ఇంట్లోనే ఉంటున్నారని ఆయన చెప్పారు. రెండెకరాల భూమిలో తనకు ఇప్పటివరకు తల్లిదండ్రులు కేవలం 10 గుంటలు మాత్రమే కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు.చట్టపరమైన చర్యలకు సిద్ధం:తన వద్ద ఇంటికి సంబంధించిన



పత్రాలు,ఆస్తి వివరాలు,ఇతర ఆధారాలన్నీ ఉన్నాయని,తన పరువు ప్రతిష్టలకు భంగం కలిగించే విధంగా సామాజిక మాధ్యమాల్లో, ఇతర శాఖ అధికారులకు తనపై ఫిర్యాదు చేస్తున్నారని పుల్యా ఆరోపించారు.“నా కుటుంబ సభ్యులు నాపై చెడు ప్రచారం చేస్తూ,ఇష్టం వచ్చినట్లు తిడుతూ,నాకున్న స్థాయిని దిగజార్చే విధంగా వ్యవహరిస్తున్నారు.నేను తల్లిదండ్రులను చూడనని దుష్ప్రచారం చేస్తున్నారు“అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.తాను తల్లిదండ్రులను జీవితాంతం చూసుకోవడానికి సిద్ధంగా ఉన్నానని, అది తన బాధ్యత అని స్పష్టం చేశారు.నాపై జరుగుతున్న తప్పుడు ప్రచారంపై జిల్లా కలెక్టర్,పోలీస్, విజిలెన్స్ అధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. అవసరమైతే చట్టపరమైన చర్యలకు సిద్ధంగా ఉన్నానని,తనపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.




**పాల్వంచ, ములకలపల్లి, లక్ష్మిదేవిపల్లి, చంద్రుగొండ**

# ఆదివాసీ మహిళలపై ఫారెస్ట్ అధికారుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

## సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ..

## మండల కార్యదర్శి కుంజా కృష్ణ



**ములకలపల్లి, జూలై 18 ప్రభాతవార్త :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మనుబోతులగూడెం గ్రామంలో పోడు భూముల వ్యవహారంలో ఆదివాసీ మహిళలపై ఫారెస్ట్ అధికారులు విచక్షణారహితంగా దాడి చేయడాన్ని సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ములకలపల్లి మండల కమిటీ తీవ్రంగా ఖండించింది.ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి కుంజా కృష్ణ మాట్లాడుతూ, అతి ఉత్సాహంతో వ్యవహరిస్తూ మహిళల గౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తించిన సంబంధిత ఫారెస్ట్ అధికారిని వెంటనే సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పొట్టకూటి కోసం పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న అమాయక ఆదివాసులపై అధికారులు దౌర్జన్యంగా వ్యవహరించడం అత్యంత దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. ఆదివాసీల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరించే అధికారులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.ఆదివాసీల జీవన హక్కులను పరిరక్షి ంచడంతో పాటు, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ డిమాండ్ చేసింది.ఈ కార్యక్రమం నాయకులు మిడియం రాజు, ఈసం వెంకన్న, చంటిబాబు,ఇంటిక లక్షి ్మ, మడకం పుల్లారావు, తదితరులు ఉన్నారు.

# శ్రీ రాగా పాఠశాల అక్రమాలపై వెంటనే చర్యలు తీసుకోవాలి

**కొత్తగూడెం ఎడ్యుకేషన్, జూలై 18 ప్రభాతవార్త:**
కొత్తగూడెంలోని శ్రీ రాగా పాఠశాలలో విద్యాశాఖ నిబంధనల ఉల్లంఘనలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పిడిఎస్‌యూ, పిడిఎస్‌యూ సంఘాల ప్రతినిధులు జిల్లా విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ (ఏడీ) శంభు ప్రసాద్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యూ జిల్లా అధ్యక్షులు బి. వీరభద్రం, జిల్లా కార్యదర్శి దుర్గం ప్రణయ్ మాట్లాడుతూ... చట్టాలు, నిబంధనలు సామాన్య ప్రజలకేనా? లేక ప్రైవేట్ విద్యా వ్యాపార సంస్థలకు వర్తించవా? అనే ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత 3 సంవత్సరాలుగా చట్టబద్ధమైన షిఫ్టింగ్ అనుమతి లేకుండానే పాఠశాల కొనసాగుతోందనీ, సంబంధిత అధికారులు ఇప్పటి వరకు స్పందించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. షిఫ్టింగ్ కు కనీస అవసరమైన రిజిస్టర్డ్ లీజ్ డీడ్ బిల్డింగ్ ఓనర్ నుండి లేకుండా షిఫ్టింగ్ దరఖాస్తు ప్రాసెసింగ్ లో ఉందని అధికారులు చెప్పడం హాస్యాస్పదమన్నారు. కొంతమంది విద్యార్థులు మత్తు పదార్థాల ప్రభావానికి గురవుతున్నారనీ ఇది అత్యంత ఆందోళనకరమని, ఈ అంశంపై వాస్తవాలను వెలికితీసేలా సంబంధిత శాఖలతో కలిసి నిష్పాక్షి క విచారణ నిర్వహించాలని కోరారు. అలాగే అక్రమ పాఠ్యపుస్తకాల విక్రయాలు, యూనిఫాంల అమ్మకాలు, అనుమతులు లేకుండా హాస్టల్ నిర్వహణ జరుగుతోందనే ఆరోపణలను కూడా సమగ్రంగా పరిశీలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోఅరుణ్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



# జనావాసాల మధ్య పేలుడు పదార్థాల తయారీ..?

**జిల్లా యంత్రాంగం దృష్టి సారించాలి**

**క్రాకర్స్ పేరుతో అక్రమ దందా?..**

**పాల్వంచలో కలకలం**

**నకిలీ బాణాసంచా తయారీ,**

**అక్రమ నిల్వల ఆరోపణలు**

**జిల్లా కలెక్టర్ జోక్యంతో**

**సమగ్ర విచారణ జరపాలని ప్రజల డిమాండ్**





**పాల్వంచ, జూలై 18 ప్రభాతవార్త:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని శ్రీనివాస కాలనీలో ఉన్న శ్రీ వెంకటేశ్వర క్రాకర్స్ దుకాణంపై స్థానిక ప్రజల్లో తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హోల్‌సేల్ బాణాసంచా విక్రయాలకు తీసుకున్న అనుమతులను అడ్డుపెట్టుకుని, అక్కడే పేలుడు పదార్థాలతో బాంబులు తయారు చేస్తున్నారనే ఆరోపణలు విని పిస్తున్నాయి. ఈ విషయం స్థానికంగా తీవ్ర చర్చకు దారి తీసింది. పేలుడు పదార్థాల తయారీ, నిల్వ, రవాణా, విక్రయాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన నిబంధనలు అమలు చేస్తున్నాయి. అలాంటి పరిస్థితుల్లో జనావాసాల మధ్య పేలుడు పదార్థాలతో తయారీ కార్యకలాపాలు జరుగుతున్నాయనే ప్రచారం ప్రజల్లో భయాందోళనలు కలిగిస్తోంది. సంబంధిత యాజమాన్యానికి అవసరమైన అన్ని అనుమతులు ఉన్నాయా? పేలుడు పదార్థాల చట్టం ప్రకారం భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు. అంతేకాకుండా, ప్రముఖ కంపెనీల పేర్లతో నకిలీ బాణాసంచా తయారు చేసి విక్రయిస్తున్నారనే ఆరోపణలు కూడా విని పిస్తున్నాయి. ఈ అంశంపై పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక, పరిశ్రమలు, పేలుడు పదార్థాల నియంత్రణ శాఖ అధికారులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఈ కేంద్రం అటవీ ప్రాంతానికి సమీపంలో ఉండటంతో ప్రమాదం జరిగితే జనావాసాలతో పాటు అటవీ సంపదకు కూడా తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. గతంలో దేశంలోని పలు ప్రాంతాల్లో పేలుడు పదార్థాల తయారీ కేంద్రాల్లో జరిగిన ప్రమాదాల్లో భారీ ప్రాణ, ఆస్తి నష్టం సంభవించిన ఘటనలను ప్రజలు గుర్తు చేస్తున్నారు. అలాంటి పరిస్థితి ఇక్కడ తలెత్తకముందే అధికారులు అప్రమత్తం కావాలని కోరుతున్నారు. ఇంతకాలంగా ఇటువంటి కార్యకలాపాలు కొనసాగుతున్నా సంబంధిత శాఖలు ఎందుకు గుర్తించలేకపోయాయనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. తనిఖీలు సక్రమంగా జరుగుతున్నాయా? లేక అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి, పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక, అటవీ, పేలుడు పదార్థాల నియంత్రణ శాఖలతో కలిసి సంయుక్త తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు జరుగుతున్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, ప్రజల ప్రాణాలకు ఎలాంటి ముప్పు లేకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.




## చొప్పకట్లపాలెం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత బ్యాగులు, పలకల పంపిణీ

బోనకల్, ప్రభాతవార్త :



మండల పరిధిలోని చొప్పకట్లపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం యూకేజీ చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులు, పలకలను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ కాటేపల్లి అశ్విని ప్రత్యేక చొరవ తీసుకుని ఈ విద్యా సామగ్రిని తెప్పించి, విద్యార్థులకు స్వహస్తాలతో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చిన్నతనం నుంచే పిల్లలకు చదువుపై ఆసక్తి, శ్రద్ధ కలగాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థుల ప్రోత్సాహానికి తమ వంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందని ఆమె పేర్కొన్నారు. చిన్నారి విద్యార్థులకు విద్యా సామగ్రిని అందించి వారి చదువుకు అండగా నిలిచిన సర్పంచును , గ్రామ పెద్దలు విద్యార్థుల తల్లిదండ్రులు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. హాజరైన ప్రముఖులు ఈ కార్య క్రమంలో ఉప సర్పంచ్ పల్లా కొండలరావు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సాటివారిగూడెంలో రియల్ ఎస్టేట్ జోరు..!

### 1/70 చట్టాన్ని ఉల్లంఘిస్తున్న అనుమతుల్లేని వెంచర్లు

**లక్ష్మీదేవిపల్లి: జూలై18 ప్రభాతవార్త:**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం సాటివారిగూడెం పంచాయతీలో రియల్ ఎస్టేట్ వ్యాపారం రోజురోజుకూ జోరందుకుంది. కొత్తగూడెం మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా మారడం, పాల్వంచ బైపాస్ రోడ్డు సౌకర్యం ఉండటంతో ఈ ప్రాంతంలో భూములకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఈ అవకాశాన్ని అదునుగా చేసుకున్న కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు వ్యవసాయ భూములను లక్ష్యంగా చేసుకుని భారీ ఎత్తున ప్లాట్ల విక్రయాలు నిర్వహిస్తున్నారు. రహదారులకు ఆనుకుని ఉన్న పంట పొలాలను చిన్న చిన్న ప్లాట్లుగా విభజించి అమ్మకాలు జరుపుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. 1/70 చట్టం ఉల్లంఘన ఆరోపణలుపూర్తి ఏజెన్సీ గ్రామమైన సాటివారిగూడెంలో 1/70 చట్టం అమల్లో ఉంది. ఈ చట్టం ప్రకారం గిరిజనేతరులు ఇక్కడ భూములు కొనుగోలు చేయడం, విక్ర యించడం నిషేధం. అయినప్పటికీ వెంచర్ల పేరుతో భారీగా లావాదేవీలు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. వెంచర్లకు సంబంధించి టీడీపీ, దీగిదిశి, పంచాయతీ అనుమతులు తీసుకున్నారా అనే అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, తాగునీటి వంటి కనీస మౌలిక సదుపాయాలు కూడా లేకుండానే ప్లాట్లను అమ్ముతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూముల ధరలకు రెక్కలుగత 23 ఏళ్లతో పోలిస్తే ఇక్కడ భూముల ధరలు 2 రెట్లు పెరిగాయి. దీంతో పెట్టుబడిదారులు, మధ్యవర్తులు పెద్దఎత్తున భూముల కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారు. నిబంధనలు పాటించకుండా వ్యవసాయ భూములను నివాస స్థలాలుగా మార్చే ప్రక్రియపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ ఎక్క? అక్రమ వెంచర్లపై వెంటనే స్పందించి సంయుక్త తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. భూమి కొనుగోలు చేసే వారు 1తీ, నిది, లేఔట్ అనుమతులు, 1/70 క్లియరెన్స్‌ను తప్పనిసరిగా పరిశీలించాలని నిపుణులు సూచిస్తున్నారు. లేకుంటే భవిష్యత్తులో కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యంత్రాంగం ఈ అక్రమాలపై ఏ చర్యలు తీసుకుంటుందో చూడాలి.

## మృతుల కుటుంబాలకు ఇఫ్టు ఆర్థిక సాయం

**మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో**

**రూ.7,200 చొప్పున అందజేత**



**ఇల్లందు అర్బన్, జూలై 18, ప్రభాత వార్త:** ఇటీవల మరణించిన ఇద్దరు కార్మికుల కుటుంబాలకు ఇఫ్టీయూ అనుబంధ మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక సహాయం అందజేశారు. శ్రీదేవి కోల్ ట్రాన్స్‌పోర్ట్‌లో పనిచేస్తున్న స్టేషన్ బస్తీకి చెందిన మందా హేమంత్ తల్లి మందా జానకమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా, పూసపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ బుడిమె రమేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వారి కుటుంబాలకు రూ.7,200 చొప్పున ఆర్థిక సాయాన్ని యూనియన్ నాయకులు అందజేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు కష్టకాలంలో తోటి కార్మికుల కుటుంబాలకు అండగా నిలవడం తమ బాధ్యత అని యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టీయూ మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు డి. మోహన్‌రావు, నాయకులు మోరే వెంకటేశ్వర్లు, పూనెం రాజేష్, ప్రశాంత్, మోకాళ్ల భద్రం, శ్రీధర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థిక సాయం

**మణుగూరు, ప్రభాతవార్త, జూలై 18:**



మణుగూరు మండలం రామానుజవరం గ్రామం అయోధ్య నగర్ కాలనీకి చెందిన కట్ట చిరంజీవి అనే వ్యక్తి గత కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్యంతో భద్రాచలంలో ఓ ప్రవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఆయన కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉండి, వైద్య ఖర్చులకు దిక్కుతోచని స్థితిలో ఉన్న విషయాన్ని ఖినైనిష ఫౌండేషన్‌ఖి సభ్యులు తెలుసుకున్నారు. బాధితుని దయనీయ పరిస్థితిపై వెంటనే స్పందించిన ఫౌండేషన్ ప్రతినిధులు, చిరంజీవి ఆరోగ్య ఖర్చుల నిమిత్తం రూ.3,000 ఆర్థిక సహాయాన్ని శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఫౌండర్ మట్టపల్లి సాగర్ యాదవ్, జర్నలిస్ట్ పోదిల వీరబాబు, అడ్వకేట్ ఈర్ల రాము, జర్నలిస్ట్ మిట్టపల్లి గోపి, సాధిని సీతయ్య, బాణాల కృష్ణ, బానోతు రమేష్, కంపేర్ల నాగేశ్వరరావు, కట్ట మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాల నేపథ్యంలో పోలీస్ అధికారులతో ఎస్పీ సమీక్ష

కొత్తగూడెం క్రైమ్, జూలై 18 ప్రభాతవార్త: రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న పుష్కర ఘాట్ల వద్ద భక్తుల భద్రత, రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్, చెక్ పోస్టుల ఏర్పాటు తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. పుష్కర ఘాట్ల వద్ద భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ముందస్తు ప్రణాళికతో బందోబస్తు ఏర్పాట్లు చేపట్టాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ఘాట్ల వద్ద నిరంతర నిఘా ఏర్పాటు చేసి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధాన రహదారులు, పుష్కర ప్రాంతాలకు వచ్చే మార్గాల్లో అవసరమైన చోట చెక్ పోస్టులు






ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను పర్యవేక్షించాలని తెలిపారు. ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళిక రూపొందించాలని, వాహనాల పార్కింగ్‌కు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. పుష్కర ఘాట్ల వద్ద ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలను పటిష్టం చేయాలని, రిస్క్ ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ తెలిపారు. పుష్కరాల సమయంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

# ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలి

## రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

కొత్తగూడెం కలెక్టరేట్, జూలై 18 ప్రభాతవార్త: సూపర్ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదై వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయం, తాగునీరు, ప్రత్యామ్నాయ పంటలు, వర్షాభావ నివారణ చర్యలపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఐడీఓసీ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, ప్రతి జిల్లా సూపర్ ఎల్‌నినో కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి పరిస్థితులను నిరంతరం సమీక్షించాలని సూచించారు. రైతులకు తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటలు, పంటల మార్పిడి విధానాలపై విస్తృత అవగాహన కల్పించాలని, విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అలాగే





తాగునీరు, పశుగ్రాసం, ఉపాధి హామీ పనులపై శాఖల వారీగా సమగ్ర సమాచారం సిద్ధంగా ఉంచాలని సూచించారు.జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, జిల్లాలో అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, నీటి పొదుపు పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నామని, విత్తనాలు, ఎరువుల సరఫరాతో పాటు తాగునీరు, పశుగ్రాసం, ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నా మని చెప్పారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాం గం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఏ పీడీ విద్యాచందన, హార్టికల్చర్ అధికారి కిషోర్ బాబు, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, గ్రౌండ్ వాటర్ ఏడీ రమేష్, మున్సిపల్ కమిషనర్ సుజాత, డీపీఓ అనూప, సీపీఓ సునీత తదితర అధికారులు పాల్గొన్నారు

# రైతుల కోసం పీఎం ఫసల్ బీమా యోజనను తక్షణమే అమలు చేయాలి

కొత్తగూడెం టౌన్, జూలై 18 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోతున్న రైతులకు ఆర్థిక రక్షణ కల్పించేందుకు శ్రీప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనకి ( పి ఎం ఎఫ్ బి వై) పథకాన్ని తక్షణమే పూర్తిస్థాయిలో అమలు చేయాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా కిషన్ మోర్చా అధ్యక్షులు గొట్టె పుల్ల దుర్గా శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. శనివారం ఈ మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు గొట్టెపుల్ల దుర్గా శ్రీనివాసరావు పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా 23 రాష్ట్రాల్లో విజయవంతంగా అమలవుతున్న ఈ పంటల బీమా పథకం మన తెలంగాణ రాష్ట్రంలో సరిగ్గా అందక పోవడం వల్ల రైతాంగం తీవ్ర అనిశ్చితిని ఎదుర్కొంటోందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్, రబీ పంటలన్నింటినీ దీని పరిధిలోకి తెచ్చి,



కౌలు రైతులకు సైతం న్యాయం జరిగేలా పారదర్శకమైన విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి మండలంలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ని కోరడం జరిగింది. రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి, జాటోత్ వెంకన్న, దురిశెట్టి కుమార్, మోహనకృష్ణ, సముద్రాల గాయత్రి, రాపాక రమేష్, మిట్టపల్లి శ్రీనివాస్, నాగుల్ చంద, వెంకటేష్ మరియు బిజెపి మహిళా నాయకురాళ్లు, బిజెపి కార్యకర్తలు అభిమానులు ఇతరులు పాల్గొన్నారు

# నేడు హతీరాం బావాజీ జయంతి భోగ్ బండారో

కొత్తగూడెం టౌన్, జూలై 18 ప్రభాతవార్త: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ నుంచి కోర్టుకు వెళ్లే దారిలో ప్రకృతి ఆశ్రమంలో ఆదివారం ఉదయం 11 గంటలకు శ్రీ హతీరాం బావాజీ 597వ జయంతి ని పురస్కరించుకుని బంజారా పూజారులు, సాధులచే భోగ్‌బండారో కార్యక్రమం నిర్వహించనున్నామని బంజారా సంఘాల జాక్ చైర్మన్ బానోత్ వీరు నాయక్ తెలిపారు. బంజారాలు అందరూ అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.






చుంచుపల్లి, జూలూరుపాడు, సుజాతనగర్

# ఆదివాసి మహిళలపై భౌతిక దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం

## జిల్లా కమిటీ కార్యదర్శి కందగట్ల సురేందర్

కొత్తగూడెం టౌన్, జూలై 18 ప్రభాతవార్త: సిపిఐ (ఎంఎల్ )న్యూడెమోక్రసీ ముఖ్య కార్యకర్తల సమావేశం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం (ఐఎఫ్టీయు) జిల్లా కార్యా లయంలో ప్రగతి శీల మహిళా సంఘం (పిఒడబ్ల్యు) జిల్లా అధ్యక్షు రాలు వీరమల్ల ఉమా అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ భద్రాద్రి, కొత్తగూడెం ఖమ్మం సంయుక్త జిల్లా కమిటీ కార్యదర్శి కందగట్ల సురేందర్, జిల్లా నాయకులు సింగనబోయిన రామన్న లు హాజరై మాట్లాడుతూ... అశ్వాపురం మండలం వేములూరు గ్రామంలో ఫారెస్ట్ అధికారులు ఆదివాసి ప్రజలపై దాడి చేసి నలుగురు మహిళలను గాయపరిచారని, వాళ్ళ పరిస్థితి ఆందోళనకరంగా ఉండిన,గాయపడిన మహిళలు సోలం జ్యోతి. కల్లి సీతమ్మ మడకం గంగమ్మ మడకం జ్యోతి పై భౌతిక దాడులకు పాల్పడ్డారు సోలం జ్యోతి పరిస్థితి సీరియస్ గా ఉండిని,ఆమె చాతి పై విపరీతంగా కొట్టారు. గంగమ్మ తొంటి కాలు విరిగింది.లేవలేని స్థితిలో ఉన్నది. ఈ దాడికి పాల్పడిన ఫారెస్ట్ అధికారులు సోడి మురళీకృష్ణ, సపావట్ కోటేశ్వర్, నునావత్ మోహన్ వీరిని తక్షణమే సస్పెండ్ చేయాలని, ఆదివాసి మహిళలపై దాడికి తెగబడిన ఫారెస్టు అధికారులపై తక్షణమే హత్యా నేరం కేసులను నమోదు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి సర్కార్ ఆదివాసి మహిళలపై దాడికి పాల్పడిన ఫారెస్ట్ అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసి సాగు చేసుకుంటున్నా పోడు భూములకు యుద్ధ ప్రాతిపదికన పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు చారు కవిత, ప్రజా సంఘాల జిల్లా నాయకులు అమారాజు గట్టయ్య, రామిశెట్టి లక్ష్మి, జోగ రామన్న, వీరమళ్ళ రాములు తదితరులు పాల్గొన్నారు.



# సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలి

## వైద్యాధికారి తరుణ్

ఆళ్లపల్లి జూలై 18 ప్రభాతవార్త వాతావరణ మార్పుల వల్ల వచ్చే సీజనల్ వ్యాధుల దగ్గు, జలుబు, జ్వరం, డెంగ్యూ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు పడాలని పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత జాగ్రత్తలు, మరియు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు చాలా ముఖ్య మని శనివారం వైద్యాధి కారి తరుణ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రభుత్వ వైద్యశాలకు 20 కిలోమీటర్ల లోపులో ఆదివాసి గిరిజన గ్రామాలు ఉంటాయి కనుక ఈ వర్షాకాలం సీజన్లో దోమలు ఎక్కువగా అభివృద్ధి చెందే అవకాశం ఉన్నందున దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. నీటి కుండీలు, కూలర్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని రాత్రి పూట తప్పనిసరిగా దోమతెరలు వాడాలని పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలని వేడి చేసి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని వారన్నారు. జ్వరము దగ్గు జలుబు ఏమైనా ఉంటే తక్షణమే ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించాలని అన్నారు.



# దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలి

**విద్యార్థులు విద్య లోనే కాకుండా విలువలతో బాధ్యతగా ఉండాలి**

**మాజీ ఐఏఎస్ అధికారి, లోక్ సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయ ప్రకాష్ నారాయణ**

**ప్రియదర్శిని లో ఆకట్టుకున్న ప్రేరణ**






**ఖమ్మం జూలై 18, ప్రభాత వార్త:** దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని, విద్యార్థులు విద్యలోనే కాకుండా విలువలు, నైతికతతో బాధ్యతగా ఉండాలని మాజీ ఐఏఎస్ అధికారి, లోక్ సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ అన్నారు.ప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ అటోనామోస్ కళాశాలలో కళాశాల చైర్మన్ కటేపల్లి నవీన్ బాబు అధ్యక్షతన జరిగిన యువ నాయకత్వం – మహిళా సాధికారతపై ప్రేరణాత్మక ఇంటరాక్టివ్ సెషన్ కార్యక్రమానికి జయప్రకాష్ నారాయణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, మహిళా సాధికారత ద్వారా సమాజాభి వృద్ధిని సాధించడం లో యువ కీలకపాత్ర పోషించాలని సూచించారు. బాధ్యతాయుతమైన పౌరసత్వం, మహిళల సాధికారత సమాజ ప్రగతికి పునాదులని ఆయన వివరించారు.దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, సమాజంలో శాశ్వతమైన మార్పు తీసుకురావాలంటే విద్యార్థులు కేవలం విద్యలోనే కాకుండా విలువలు, నైతికత, బాధ్యతాయుతమైన పౌరసత్వం, నాయకత్వ లక్షణాలను కూడా అలవరచుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ కాలంలో సమస్యలను విశ్లేషించే సామర్థ్యం, విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకత, సమాజం పట్ల బాధ్యత వంటి అంశాలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. మార్పు కోసం ఇతరుల కోసం ఎదురు చూడకుండా, ప్రతి వ్యక్తి తనలోనే మార్పు ప్రారంభిస్తే సమాజంలో సానుకూల పరివర్తన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల చైర్మన్ కటేపల్లి నవీన్ బాబు మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, సామాజిక బాధ్యత, నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. బత్తుల గోపాల్, డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ పాల్గొని అతిథులను ఆహ్వానిస్తూ విద్యార్థులకు ఇలాంటి ప్రేరణాత్మక కార్యక్రమాలు భవిష్యత్తులో మరింత ఉపయోగపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు

**ఖమ్మం జూలై 18, ప్రభాత వార్త:**

భారతదేశ యువత పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కేంద్ర (బీజేపీ) ప్రభుత్వానికి వ్యతిరేకంగా లోక్ సభ పక్షనేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా చేపట్టిన ఛాత్రూన్ కి గూంజ్ కార్యక్రమంలో భాగంగా ఏ ఐ సి సి ఆదేశానుసారం టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏ ఐ సి సి ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ల పిలుపుమేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన నిరాహారదీక్ష కార్యక్రమం చేపట్టారు. ముందుగా నిరాహార దీక్షలో కూర్చున్న నూతి సత్యనారాయణ గౌడ్ కు దండ అలంకరించి సంఘీభావం తెలిపిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదే విధంగా సంఘీభావంగా దీక్షలో కూర్చున్న వారికి ఖమ్మం కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్,శాసనమండలి సభ్యులు పోట్ల నాగేశ్వరరావు, శాసనసభ మాజీ సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న లు సంఘీభావం తెలిపారు. అదే విధంగా ఈ దీక్షలో నూతి సత్యనారాయణ గౌడ్ కు సంఘీభావంగా దీక్షలో కూర్చున్న జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు కొత్త సీతారాములు, దొబ్బల సౌజన్య,వేజండ్ల సాయి కుమార్, సయ్యద్ గౌస్, మొక్కా శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య, సయ్యద్ హుస్సేన్, విప్లవ కుమార్, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు కర్నాటి రామారావు,కీలారు అనిల్ కుమార్, బచ్చలకూర నాగరాజు, మూడుముంతల గంగరాజు యాదవ్, దామా స్వరూప,ప్రభావతి రెడ్డి,గాదెల యూస్ఫీ, శ్రీలత,శ్రీనివాస్ యాదవ్,వేల్పుల మురళి,అన్నపూర్ణ, లక్ష్మీ తదితరులు దీక్షలో కూర్చొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ భారతదేశ యువత పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కేంద్ర (బీజేపీ) ప్రభుత్వానికి వ్యతిరేకంగా లోక్ సభ పక్షనేత రాహుల్ గాంధీ అత్యంత ప్రతిష్టాత్మకంగా దేశ వ్యాప్తంగా తీసుకున్న ఛాత్రూన్ కి గూంజ్ కార్యక్రమం, టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఏ ఐ సి సి ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ల పిలుపు




మేరకు నిర్వహించామని అదే విధంగా నీట్ పేపర్ లో లీకేజీ లు ఇది మొదటిసారి కాదని ఇంతకు ముందు కూడా జరిగిందని ఈ లీకేజీ కారణంగా ఎంతో మంది విద్యార్థులు,విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురయ్యారని, విద్యార్థుల ఆత్మహత్య చేసుకొన్నారని అదే విధంగా కేంద్ర (బీ జె పి) ప్రభుత్వం అనేక సందర్భాలలో రాజ్యాంగాన్ని ఉల్లంఘించారని ప్రజలు గమనిస్తున్నారని రాబోవు రోజుల్లో ప్రజలు వారికి తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. సాయంత్రం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ కు నిమ్మరసం ఇచ్చి విరమింపజేసిన సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్,శాసనసభ మాజీ సభ్యులు కొండబాల కోటేశ్వరరావు,పులిపాటి వెంకయ్య లు. అదే కార్యక్రమ విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు . ఈ కార్యక్రమంలో వీరితో పాటు జిల్లా కాంగ్రెస్ కమిటీ కోశాధికారి పులిపాటి వెంకయ్య, సహెలా జావేద్, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు రంగా జనార్ధన్, వనం ప్రదీప్త చక్రవర్తి(బాబు), మదు పల్లి భాస్కర్ గౌడ్,ప్రతిభారెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటి సభ్యులు, బ్లాక్ మండల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, నగర కాంగ్రెస్ కమిటి సభ్యులు ,కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## రాఘవరావుని పరామర్శించిన తుమ్మల

**ఖమ్మం అర్బన్, జులై 18(ప్రభాత వార్త**

హైదరాబాద్ లో నిమ్స్ హాస్పిటల్ ఖమ్మం నగరానికి చెందిన సాహితి విద్యాసంస్థల అధినేత రాఘవరావుని పరామర్శించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అదేవిధంగా హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ రాహుల్ దేవ్ రాజ్ ని రాఘవరావు ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుని వారికి మెరుగైన వైద్యం అందించాలని తెలిపినారు అదేవిధంగా వారి కుటుంబ సభ్యులకు అధైర్య పడుద్దని మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు.



# ఖమ్మం టౌన్ వార్త

## యస్.బి.ఐ.టి. లో దిగ్విజయంగా రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

**ఖమ్మం విద్యా విభాగం జూలై 18, ప్రభాత వార్త:**



యస్.బి.ఐ.టి. కళాశాల ప్రాంగణంలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు రెండవ రోజుకూడా దిగ్విజయంగా కొనసాగాయి. ఈ పోటీలను యస్.బి.ఐ.టి. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ, సర్వజ్ఞ అండ్ రెసోనెన్స్ చైర్మన్ నాగేంద్ర కుమార్, టోర్నమెంట్ ఆర్గనైజర్ టి. వీరయ్య కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా యస్.బి.ఐ.టి. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ, చెస్ వంటి మేధో క్రీడలు విద్యార్థుల్లో విశ్లేషణాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యం, సహనం ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ టోర్నమెంట్ నందు ప్రతి ఆటగాళ్ళకి రేటింగ్ అందిస్తూ విజేతలుగా నిలిచిన నలుగురు ఆటగాళ్ళకు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈ పోటీల ముగింపు వేడుక రేపు నిర్వహించి విజేతలను ప్రకటిస్తామని నిర్వాహకులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజ్‌కుమార్, అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎ.వి.వి. శివ ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఖమ్మం మమతా మెడికల్ కాలేజీ లో స్తంభద్రి ఐకాన్ 2026 ప్రారంభం

**మాజీ మంత్రి పువ్వాడ**




**ఖమ్మం వైద్య విభాగం,జులై18(ప్రభాత వార్త )** తెలంగాణ స్టేట్ 11వ ఆఫ్తాల్మాలజికల్ కాన్ఫరెన్స్ జ్యోతిప్రజ్వల్ చేసి వర్క్ కాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా అజయ్ కుమార్ గారు మాట్లాడుతూ.. సర్వేంద్రియానామ్ నయనం ప్రధానం అన్ని దానాల కన్నా నేత్రదానం మిన్న దేశం లో అనేక హాస్పిటల్స్ ఉన్న ఈ సమస్య తో ఎంతో మది బాధపడుతున్న మన ఖమ్మం లో కాన్ఫరెన్స్ పెట్టటం సంతోషంగా ఉంది అని తెలిపారు ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా మాజీ ఐఏఎస్ జయ ప్రకాష్ నారాయణ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు మమత మెడికల్ కాలేజీ డైరెక్టర్,.పువ్వాడ నరేన్ .విజయ్ కుమార్ .ప్రవీణ్ కృష్ణ, ,నందకిషోర్,.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు




# గిరిజనులపై ఫారెస్ట్ అధికారుల దాడులు అన్యాయం

**బీఆర్ఎస్ పార్టీ మణుగూరు మండల, పట్టణ మాజీ అధ్యక్షులు కుర్రి నాగేశ్వరరావు, కుంట లక్ష్మణ్**

మణుగూరు, ప్రభాతవార్త, జూలై 18:

పోడుభూమి సాగు చేసుకుంటున్న గిరిజనులపై ప్రభుత్వ ఆదేశాలతో ఫారెస్ట్ అధికారులు దాడులకు తెగబడటం అన్యాయమని మణుగూరు మండల బిఆర్ఎస్ మండల, పట్టణ మాజీఅధ్యక్షులు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, కుంట లక్ష్మణ్ మండిపడ్డారు. స్థానిక బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అశ్వాపురం మండలం మనుబోతులగూడెం గ్రామంలో పోడు



పట్టాదారులను, మహిళలను కూడా చూడకుండా ఫారెస్ట్ అధికారులు విచక్షణారహితంగా చిత్రహింసలకు గురిచేశారని, పత్తి పంటను నాశనం చేశారని ఆరోపించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ ఆదేశాలతో, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పోరాడి గిరిజనులకు పోడు పట్టాలు ఇప్పించారని గుర్తుచేశారు. ప్రస్తుతం గిరిజనులు కొద్దిగా అదనంగా సాగు చేసుకుంటుంటే దానిని నెపంగా పెట్టుకొని దాడులు చేయడం సరికాదన్నారు. భవిష్యత్తులో గిరిజనులపై దాడులు జరిగితే సహించేది లేదని, బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. పాలకులు తక్షణమే స్పందించి వివాదంలో ఉన్న భూమిని గిరిజనులకు చట్టబద్ధంగా అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నూకారపు రమేష్, అక్కి నరసింహారావు, ముద్దంగుల కృష్ణ, ఎస్కే మోలానా, జావిద్ బాషా, తురక రామకోటి, వెంకట్ పాల్గొన్నారు.

## రైతులకు షరతులు లేకుండా యూరియా అందించాలి

**బిజేపీ మండల అధ్యక్షుడు దూలిపూడి శివప్రసాద్**

పినపాక,ప్రభాత వార్త,జూలై 18



కౌలు రైతులకు ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం ఎరువులు, యూరియాను అందించాలని మండల బిజేపీ అధ్యక్షుడు దూలిపూడి శివప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. దుగినేపల్లి లో ఆయన శనివారం మాట్లాడుతూ రాష్ట్రంలో ఖరీఫ్ సాగు పనులు వేగంగా కొనసాగుతున్న తరుణంలో యూరియా కొరత కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా సొంత భూమి లేని కౌలు రైతులు సాగు చేస్తున్న క్రమంలో ఎన్నో నిబంధనల కారణంగా యూరియా పొందడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ ఉత్పత్తి పెరగాలంటే కౌలు రైతులకు సైతం సొంత భూములున్న రైతులతో సమానంగా ప్రాధాన్యం కల్పించాలని, ఎలాంటి షరతులు లేకుండా యూరియాను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలను వెంటనే గుర్తించి, యూరియా కొరత నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని, కౌలు రైతులకు వివక్ష లేకుండా ఎరువులు పంపిణీ చేసేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

## నేడు మంత్రి పొంగులేటి పర్యట పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు

**పినపాక ఎమ్మెల్యే పాయం**

మణుగూరు, ప్రభాతవార్త, జూలై 18:



పినపాక నియోజకవర్గంలో ఆదివారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. అశ్వాపురం మండలంలో రూ.2.50 కోట్లతో నిర్మించనున్న ఆశ్రమ పాఠశాల అదనపు గదులకు శంకుస్థాపన, రూ.25 కోట్లతో నిర్మించిన అశ్వాపురం మొండికుంట బీటీ రోడ్డు, రూ.20 లక్షలతో నిర్మించిన అమ్మగారిపల్లి జీపీ భవనాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం మణుగూరు మండలంలో రూ.1 కోట్లతో గుట్టమల్లారంకట్టుమల్లారం రోడ్డు, రూ.2.50 కోట్లతో సాయినగర్‌లంకమల్లారం హై లెవెల్ బ్రిడ్జి పనులకు భూమిపూజ చేయనున్నారు. బూర్గంపాడు మండలంలో మోరంపల్లి బంజర ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు, పట్టి నగర్‌లో రూ.2.50 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు భూమిపూజ చేయనున్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పినపాక ఎమ్మెల్యే పాయం కోరారు.

## మంత్రి పొంగులేటి,ఎమ్మెల్యే పాయం పర్యటనను విజయవంతం చేయాలి

**మణుగూరు మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పీరినాకి నవీన్, కురం రవి**

మణుగూరు, ప్రభాతవార్త, జూలై 18:



తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం పినపాక నియోజకవర్గంలో పర్యటించనున్నారు. పినపాక నియోజకవర్గంలోని మూడు మండలాల్లో సుమారు రూ.33 కోట్ల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు వారు శంకుస్థాపనలు చేయనున్నారు. ఇందులో భాగంగా మణుగూరు మండలంలో గుట్టమల్లారం బీటీ రోడ్డు, సమితి సింగారంలంకమల్లారం మధ్య కోడిపుంజుల వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహిస్తారు. ఈ పర్యటనను విజయవంతం చేయాలని మణుగూరు మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పీరినాకి నవీన్, కురం రవి పిలుపునిచ్చారు. శనివారం మణుగూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, అభిమానులు ఈ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు పొలమూరి రాజు, దొబ్బల వెంకటప్పయ్య, బోనగిరి శివ సైదులు, కూరపాటి సౌజన్య, గాండ్ల సురేష్, గణేష్ రెడ్డి, రహీమ్ పాషా, లవకుమార్, ఊకె కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## మనుబోతులగూడెం ఘటనపై అశ్వాపురం రేంజ్ కార్యాలయంలో వివరణ

**దాడి చెందిన10 మంది పై పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు**

**సంబంధిత అటవీ అధికారిపై విచార**

**అపోహలు,తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు**

**ఎఫ్ డి ఓ బి.బాబు**

అశ్వాపురం,ప్రభాతవార్త, జులై 18:



మణుగూరు రేంజ్ పరిధిలోని మనుబోతులగూడెం గ్రామపంచాయతీ నాగేశ్వరావు గుంపు వద్ద శుక్రవారం చోటుచేసుకున్న ఘటనపై శనివారం అశ్వాపురం రేంజ్ కార్యాలయంలో అటవీశాఖ అధికారులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ డి ఓ బి.బాబు మాట్లాడుతూ ఘటనకు సంబంధించి 10 మందిపై స్థానిక పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసినట్లు తెలిపారు. అలాగే, సంబంధిత అటవీ అధికారిపై కూడా విచారణ చేపడుతున్నట్లు వెల్లడించారు. అడవుల సంరక్షణలో ప్రజల సహకారం అత్యంత అవసరమని పేర్కొన్న ఆయన, అటవీ భూముల ఆక్రమణలు, అక్రమ కలప రవాణా, అడవుల విధ్వంసాన్ని అరికట్టేందుకు చట్టబద్ధమైన చర్యలు మాత్రమే తీసుకుంటామని స్పష్టం చేశారు .అటవీశాఖ సిబ్బంది ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తారని, ఈ ఘటనపై వస్తున్న అపోహలు, తప్పుడు ప్రచారాలను ఎవరూ నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం చేపడుతున్న హరితహారం, అటవీ పునరుద్ధరణ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజల సహకారంతోనే అడవులను పరిరక్షి ంచి భావితరాలకు పచ్చని తెలంగాణను అందించగలమని ఎఫ్డిఓ బాబు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మణుగూరు రేంజర్ ఉపేందర్, అశ్వాపురం రేంజర్ సత్తార్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ సి సి నమోదు ప్రక్రియ

అశ్వాపురం,ప్రభాతవార్త, జులై 18:



తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాల మణుగూరు మిట్టగూడెం నందుఎన్ సిసి కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సంజయ్ కుమార్ భద్ర ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎన్సిసి నమోదు ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ రవి బండారుపల్లి శనివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆగస్టు ఆరవ తేదీన జరుగు నమోదు ప్రక్రియలో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు.

## రైతులకు డీఎస్ఆర్, ఎల్‌నినో పై రైతులకు అవగాహన

**మట్టి పరీక్ష కిట్ల పంపిణీ**

అశ్వాపురం,ప్రభాతవార్త, జులై 18:

ఎస్‌బీఐ ఫౌండేషన్ సహకారంతో భారత వరి పరిశోధన సంస్థ (ఐకార్ఐ ఐ ఆర్ ఆర్) ఆధ్వర్యంలో అశ్వాపురం మండలం జగ్గారం గ్రామంలో వరి పంటలో నేరుగా వరి విత్తే పద్ధతి (డి ఎస్ ఆర్), దాని ప్రయోజనాలు, సాగు యాజమాన్యం మరియు ఎల్‌నినో పరిస్థితుల్లో రైతులు అనుసరించాల్సి న శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత వరి పరిశోధన సంస్థ రీసెర్చ్ అసోసియేట్ శ్రీ



కవిరాజు డీఎస్ఆర్ సాగు విధానం, దాని ప్రయోజనాలు మరియు శాస్త్రీయ సాగు పద్ధతులపై రైతులకు వివరించారు. మణుగూరు సహాయ వ్యవసాయ సంచాలకులు బి. తాతారావు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని వాతావరణ సూచనలకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని, నీటి పొదుపు చర్యలు పాటించాలని, మట్టి పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం చేపట్టాలని రైతులకు సూచించారు. మండల వ్యవసాయ అధికారి మహేష్ చంద్ర ఛటర్జీ రైతులు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకుంటూ అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులకు మట్టి పరీక్ష కిట్లు పంపిణీ చేశారు. యంగ్ ప్రొఫెషనల్ శ్రీకాంత్, వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రశాంత్, రమాదేవి మరియు జగ్గారం గ్రామ రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మాంసం ప్రియులు తస్మాత్ జాగ్రత్త..!!!

**కేజీ కొంటే క్వార్టర్ కట్..!**

**మాంసం దుకాణాల్లో మోసాల మయం**

**తక్కువ తూకం..పాత మాంసం..**

**తప్పుదోవ పట్టించే విక్రయాలు బట్టబయలు**

**తూనికలు కొలతలు జిల్లా అధికారులు**

**ఆకస్మిక తనిఖీలు**

**పలు దుకాణాల్లో తూకాల్లో తేడాలు**

**యజమానులకు జరిమానాలు**





**ఇల్లందు, జులై 18, ప్రభాతవార్త:** మాంసం కొనుగోలు చేసేందుకు దుకాణాలకు వెళ్లే వినియోగదారులు జేబు ఖాళీ చేసుకోవడమే కాదు, ఆరోగ్యాన్నీ పణంగా పెడుతున్న పరిస్థితులు జిల్లాలో వెలుగుచూస్తున్నాయి. మటన్, చికెన్, చేపల దుకాణాల్లో తక్కువ తూకం వేయడం నుంచి నిల్వ మాంసాన్ని తాజాగా విక్రయించడం వరకు అనేక అక్రమాలు తూనికలు–కొలతల శాఖ అధికారుల తనిఖీల్లో బయటపడటంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక కేజీకి డబ్బులు చెల్లించినా పూర్తి బరువు చేతికి అందకపోవడం, అధిక ధరలు వసూలు చేస్తూనే నాణ్యతలేని మాంసాన్ని విక్రయించడం ప్రజల ఆగ్రహానికి కారణమవుతోంది.

### తూకంలోనే తేడా...

### వినియోగదారుడికే నష్టం

తనిఖీల్లో పలు దుకాణాల్లో కేజీ మాంసానికి 200 నుంచి 300 గ్రాముల వరకు తక్కువ తూకం వేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అంటే కస్టమర్ వెయ్యి రూపాయల విలువైన మాంసం కొన్నా, అందులో గణనీయమైన భాగం తక్కువగా ఇస్తున్న పరిస్థితి నెలకొంది. రోజంతా ఇలాంటి విధానంలో వందలాది మంది వినియోగదారులను మోసం చేస్తూ అక్రమంగా భారీ మొత్తంలో లాభాలు పొందుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఫ్రిజ్‌లో నిల్వ... మరుసటి రోజు తాజా మాంసమంటూ విక్రయాలు రోజు అమ్ముడుపోని మాంసాన్ని పారేయకుండా ఫ్రిజ్‌లలో నిల్వ చేసి, మరుసటి రోజు తాజా మాంసంగా విక్రయిస్తున్న ఘటనలు కూడా బయటపడ్డాయి. పరిశుభ్రత ప్రమాణాలు పాటించకుండా నిల్వ చేసిన మాంసం ఆరోగ్యానికి తీవ్ర ముప్పుగా మారే అవకాశముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి మాంసం తీసుకుంటే ఫుడ్ పాయిజనింగ్, కడుపు సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు.

### మేక మాంసమా...

### గొర్రె మాంసమా...?

మేక మాంసానికి ఉన్న అధిక డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు గొర్రె మాంసాన్ని మేక మాంసంగా విక్రయిస్తున్నట్లు తనిఖీల్లో బయటపడింది. సాధారణ వినియోగదారులు ఈ తేడాను గుర్తించడం కష్టమనే విషయాన్ని అవకాశంగా తీసుకుని కొందరు వ్యాపారులు అక్రమాలకు పాల్పడు తున్నారని అధికారులు పేర్కొన్నారు. చేపల దుకాణాల్లోనూ అదే పరిస్థితి మాంసం దుకాణాలకే కాకుండా చేపల విక్రయ కేంద్రాల్లో కూడా తక్కువ తూకం, ధృవీకరణ లేని త్రాసుల వినియోగం, నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం చేస్తున్న ఘటనలు బయటపడ్డాయి. పలు దుకాణాల్లో త్రాసులకు తూనికలు–కొలతల శాఖ స్టాంపింగ్ లేకపోవడాన్ని అధికారులు గుర్తించారు.

### అక్రమాలకు జరిమానాలు

తనిఖీల్లో నిబంధ నలు ఉల్లంఘించిన మటన్, చికెన్, చేపల దుకాణాల యజమానులపై తూనికలు- కొలతల శాఖ కేసులు నమోదు చేసి జరిమానాలు విధించింది. వినియోగదారులను మోసం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. వినియోగదారులు తప్పనిసరిగా చేయాల్సి నవి మాంసం లేదా చేపలు కొనుగోలు చేసే సమయంలో త్రాసుపై చూపిస్తున్న బరువును తప్పనిసరిగా గమనించాలని అధికారులు సూచిస్తున్నారు. తూనికలు–కొలతల శాఖ ధృవీకరణ ముద్ర ఉన్న త్రాసులనే ఉపయోగిస్తున్నారా లేదా చూసుకోవాలని, బిల్లు తీసుకోవాలని, అనుమానా స్పదంగా అనిపిస్తే వెంటనే సంబంధిత శాఖకు ఫిర్యాదు చేయాలని కోరుతున్నారు.

### మోసాలకు తావిస్తే కఠిన చర్యలే

**జిల్లా తూనికలు - కొలతల శాఖ అధికారి మనోహర్**

జిల్లాలో మటన్, చికెన్, చేపల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని జిల్లా తూనికలు–కొలతల శాఖ అధికారి మనోహర్ తెలిపారు. తక్కువ తూకం వేయడం, వినియోగ దారులను తప్పుదోవ పట్టించడం, నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం చేయడం వంటి చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలతో పాటు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

### తనిఖీలతోనే సరిపోదు...

### ప్రజల అప్రమత్తత కూడా అవసరం

వినియోగదారుల హక్కులను కాపాడడంలో అధికారులతో పాటు ప్రజల పాత్ర కూడా కీలకమని సామాజిక వర్గాలు పేర్కొంటున్నాయి. తక్కువ తూకం, నాసిరకం మాంసం, అధిక ధరలు వంటి అక్రమాలను చూసీచూడనట్లు వదిలేయకుండా ఫిర్యాదు చేస్తేనే ఇలాంటి మోసాలకు అడ్డుకట్ట పడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. ప్రజల అప్రమత్తత పెరిగితేనే నిజాయితీగా వ్యాపారం చేసే వారికి ప్రోత్సాహం లభిస్తుందని సూచిస్తున్నారు.

# ఏజెన్సీ ప్రజలకు కార్పొరేట్ వైద్యం

**ఆరు నెలల్లో అందుబాటులోకి 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య**





**ఇల్లందు, జూలై 18, ప్రభాతవార్త:** ఇల్లందులో నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి భవనాన్ని ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ సందర్శించి నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా టీజీఎంఐడీసీ డీఈ, ఏఈ, నిర్మాణ కాంట్రాక్టర్ ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రణాళిక ప్రకారం వేగంగా కొనసాగుతున్నాయని, ఈ ఏడాది డిసెంబర్ నాటికి పనులు పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటిస్తూ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి భవనాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, టీజీఎంఐడీసీ డీఈ, ఏఈ, నిర్మాణ కాంట్రాక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.




**ఇల్లెందు, గుండాల, టేకులపల్లి**

## న్యాయవాది రవి నాయక్ కుటుంబానికి ఎమ్మెల్యే కోరం కనకయ్య పరామర్శ

ఇల్లందు అర్బన్, జులై 18, ప్రభాతవార్త:



ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది భుక్యా రవి నాయక్ ఇటీవల మృతి చెందడంతో ఆయన స్వగృహానికి వెళ్లిన ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా భుక్యా రవి నాయక్ చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మండల రాంమహేష్, కాంగ్రెస్ నాయకులు పూనెం సురేందర్, తాటి భిక్షం తదితరులు పాల్గొన్నారు.

## తాను అస్తమించాడు.. నలుగురిలో వెలుగు నింపాడు

**ప్రాణదాతగా నిలిచిన రంగినేని రామలక్ష్మారెడ్డి తండ్రి చివరి కోరికను నెరవేర్చిన కుమారుడు..**

**అవయవదానంతో నలుగురికి జీవనదీపం**





**ఇల్లందు అర్బన్, జూలై 18, ప్రభాతవార్త:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన రంగినేని రామలక్ష్మారెడ్డి బ్రెయిన్ డెడ్ కావడంతో హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులు ఆయన జీవితకాలంలో వ్యక్తం చేసిన కోరికను గౌరవిస్తూ అవయవదానానికి ముందుకొచ్చారు. బతికున్నప్పుడే "నేను చనిపోయినా నా అవయవాలు నలుగురికి ఉపయోగపడాలి" అని తరచూ చెప్పేవారని కుటుంబ సభ్యులు తెలిపారు. తండ్రి కోరికను నెరవేర్చాలనే సంకల్పంతో కుమారుడు వైద్యుల సమక్షంలో అవయవదానానికి అంగీకరించారు. దీంతో రంగినేని రామలక్ష్మారెడ్డి అవయవాలు అవసరమైన రోగులకు అందేలా వైద్యులు చర్యలు చేపట్టారు. తండ్రిని కోల్పోయిన బాధలోనూ మానవత్వాన్ని చాటుతూ అవయవదానానికి ముందుకొచ్చిన కుటుంబ సభ్యుల నిర్ణయాన్ని పలువురు అభినందిస్తున్నారు. చనిపోయిన తర్వాత కూడా నలుగురికి కొత్త జీవితాన్ని ప్రసాదించే అవయవదానం గొప్ప మానవతా సేవ అని వైద్యులు, సామాజిక వర్గాలు పేర్కొంటూ, మరింత మంది ఈ దిశగా ముందుకు రావాలని పిలుపునిస్తున్నారు.

# సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

**ఎంపి రామ సహాయం రఘురామరెడ్డి ఎమ్మెల్యే జారతో కలిసి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం**

అశ్వారావుపేట రూరల్, జూలై 18 ప్రభాతవార్త:

గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉమ్మడి ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో కలిసి మండలంలోని పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు పలు పనులకు శంకుస్థాపనలు చేశారు. ముందుగా నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రెటెడ్ స్కూల్, ఎకోపార్క్ పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత గడువులో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ పార్కు పూర్తయితే అశ్వారావుపేట పట్టణానికి ప్రత్యేక ఆకర్షణగా మారడంతో పాటు పర్యాటక అభివృద్ధికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.





అనంతరం ఊట్లపల్లి, మల్లాయగూడెం, అనంతారం, గాండ్లగూడెం గ్రామాల్లో సీసీ రోడ్లను, జెట్టివారిగూడెం, కొత్తూరు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. గుమ్మడివల్లి గ్రామంలో మహిళా సంఘాల కార్యకలాపాలు, గ్రామస్థాయి సమావేశాలు నిర్వహించేందుకు ఉపయోగపడే వీఓ (విలేజ్ ఆర్గనైజేషన్) భవనాన్ని ప్రారంభించారు. రమణక్కపేట, ఆసుపాక గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తోగ్గూడెం గ్రామంలో బోర్‌వెల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తున్నామని, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. రోడ్లు, తాగునీటి సౌకర్యాలు, గ్రామాభివృద్ధి భవనాలు, పార్కులు వంటి అభివృద్ధి పనులు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయని అన్నారు. ప్రతి గ్రామం అభివృద్ధి చెందే వరకు తమ కృషి నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, కౌన్సిలర్లు, అన్ని శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నాం

**ఎంపి రఘురామరెడ్డి, ఎమ్మెల్యే జారె**

దమ్మపేట, జూలై 18 ప్రభాతవార్త:

గ్రామాల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నామని ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘు రామరెడ్డి, అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణలు పేర్కొన్నారు. శనివారం దమ్మపేట మండలంలోని నాచారం, వడ్లగూడెం, మారప్పగూడెం, పాత చీపురుగూడెం, కొత్త చీపురుగూడెం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్ల అభివృద్ధి పనులను ప్రజాపతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభోత్సవాలు చేశారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లోని సీఎంఆరఎఫ్ లబ్ధిదారులకు



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా అందజేశారు. అనంతరం నాచారం గ్రామంలో రూ.10 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్లను, వడ్లగూడెం గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అదేవిధంగా మారప్పగూడెం పంచాయితీ పాత చీపురుగూడెం గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మించిన పంచాయితీ సీసీ రోడ్డు, కొత్త చిపురుగూడెంలో సీసీ రోడ్డును ప్రారంభోత్సవం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం అందించే నిధులను సమర్థవంతంగా వినియోగించి గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే దిశగా అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న పేద ప్రజలను ఆదుకోవడానికి సీఎంఆరఎఫ్ నిధులు ఎంతో దోహదపడతాయన్నారు. అభివృద్ధి పనులు ప్రజలకు అనుకూలంగా ఉండేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, అధికారులు, జిల్లా, మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జనం మధ్యలో నాయకులు.. సరళత్వానికి నిలువెత్తు రూపాలు



దమ్మపేట, జూలై 18, ప్రభాతవార్త:

నియోజకవర్గ పర్యటనలో ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎంపి రామసహాయం రఘురామరెడ్డి, ఎమ్మెల్యే జారె ఆదినారాయణలు తమ నిరాడంబరత్వాన్ని చాటుకున్నారు. పర్యటనలో భాగంగా మందలపల్లి రోడ్డు పక్కన ఓ చిన్న ఇడ్లీబండి వద్ద ఆగి ఎటువంటి హంగు ఆర్భాటాలు లేకుండా జనం మధ్యలో కలిసి పోయారు. అక్కడ సగటు పౌరుడిలా టిఫిన్ చేసి బండి యజమానిని ఆత్మీయంగా పలకరించి మంచి చెడులను తెలుసుకున్నారు. ప్రజల మనిషిగా వారి కష్టసుఖాలను నేరుగా తెలుసుకోవడం వారి నిరాడంబరత్వానికి అద్దం పడుతుంది.

## కౌన్సిల్ సెక్రెటరీ నాగలక్ష్మి కలిసిన బార్ కమిటీ

దమ్మపేట రూరల్ జూలై 18 ప్రభాత వార్త :



హైదరాబాద్ బార్ కౌన్సిల్ సెక్రెటరీ నాగలక్ష్మి ని దమ్మపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు గొంది మురళి, న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. న్యాయవాదుల సంక్షేమం, క్రొత్త న్యాయవాదుల యొక్క ఓటు, హెల్త్ కార్డుల గురించి చర్చించారు. దమ్మపేట కోర్టుకి దమ్మపేట బార్ అసోసియేషన్ కి అన్ని విషయాల్లో సహాయ సహకారం అందిస్తామని బార్ కౌన్సిల్ సెక్రటరీ నాగలక్ష్మి తెలిపారు. అనంతరం ఆమెను శాలువతో సత్కరించారు.కార్యక్రమంలో సెక్రెటరీ లక్కినేని నరేంద్రబాబు, న్యాయవా దులు తమ బాలరాజు, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి

దమ్మపేట రూరల్ జూలై 18 ప్రభాతవార్త

:ఇటీవల అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని బిజెపి నాయకులు తంబళ్ల రవి పామాయిల్ ఫ్యాక్టరీ మేనేజర్ ను కోరారు. శనివారం ఆ ఫ్యాక్టరీని బిజెపి నాయకులు సందర్శించారు. ప్రమాదం ఎలా జరిగింది అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాన్ని గోప్యంగా ఉంచడం తగదన్నారు. తరచు ఫ్యాక్టరీలో



ప్రమాదాలు జరుగుతున్నాయని ఉన్నతాధికారులు సందర్శించి లోపాలను సరిదిద్దాలన్నారు. కార్మికుల భద్రత కోసం అంబులెన్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దారా నాగేశ్వరరావు, గూడ ముత్యాలరావు, పూచి ప్రసాద్, శ్రీనివాసరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




## మధ్యాహ్నభోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి




అశ్వారావుపేట టౌన్, జూలై 18 ప్రభాతవార్త:

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 23న కలెక్టరేట్ వద్ద ధర్నా సందర్భంగా సమ్మె నోటీస్ ఎంఈ ఓ ప్రసాద్‌రావుకు శనివారం కార్మికులు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు పిట్టల అర్జున్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమ ఎన్నికల వాగ్దానంలో మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేలు పెంచుతామని చెప్పి వంట కార్మికుల మొహం కూడా చూడటం లేదని, ఈ విద్యా సంవత్సరంలో మార్కెట్ నిత్యవసర వస్తువుల రేట్లు చుక్కలని తాకుతున్న పాఠశాల విద్యార్థుల మెనూ చార్జీలు పెంచాలన్న సోయి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని విమర్శించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, విద్యార్థుల మెనూచార్జీలు రూ.25 పెంచాలని, గ్యాస్ కోడిగుడ్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు, యూనిఫామ్, ప్రమాద బీమా సౌకర్యాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు నన్ని, యామిని, సీత, పద్మ, రమాదేవి, పుష్ప, దశమి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన సదస్సు



అశ్వారావుపేట అర్బన్, జూలై 18 ప్రభాతవార్త:

స్థానిక వ్యవసాయ కళాశాలలో శనివారం వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ ఏ.సరస్వతి విద్యార్థినుల్లో రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ప్యాడ్లు అంటే ఏమిటి, వాటిని ఎలా ఉపయోగించాలి, ఎప్పుడు మార్చాలి, వాటి వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలను విద్యార్థినులకు వివరించారు. అలాగే సాధారణ శానిటరీ ప్యాడ్లు, కాటన్ శానిటరీ ప్యాడ్ల మధ్య ఉన్న తేడాలను వివరించి, కాటన్ ప్యాడ్ల వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. అనంతరం విద్యార్థినులకు కాటన్ శానిటరీ ప్యాడ్లను పంపిణీ చేశారు. రుతుక్రమ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎనఎసఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు స్రవంతి, శ్రీజన్, ఝాన్సీ రాణి, హెల్త్ క్లినిక్ ఇంచార్జి డా. శిరీష, డాక్టర్ నాగాంజలి, డాక్టర్ నీలిమ, డాక్టర్ శ్రావిక, హిమశ్రీ, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# వైరా ఆయకట్టు వరి రైతులకు సాగునీరు అందించాలి...

**బి ఆర్ ఎస్ డిమాండ్ వైరా ఆయకట్టు పరిధిలో అధిక ప్రాధాన్యత వరి పంటకే**

**రైతులను ఇబ్బందులకు గురి చేస్తే ఆందోళన తప్పదు**

*వైరా టౌన్ జూలై 18 (ప్రభాతవార్త)*

వైరా ఆయకట్టు వరి రైతులకు సకాలంలో సాగునీరు అందించాలని. వైరా ఆయకట్టు పరిధిలోని అధిక శాతం రైతులు వరి పంటకే ప్రాధాన్యత ఇస్తారని. వైరా ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ లేని పక్షంలో బి ఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని జిల్లా బీఆర్ఎస్ నాయకులు కట్ల కృష్ణార్జునరావ్ బాణాల వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైరా రిజర్వాయర్ పరిధిలో సుమారు 17 500 హెక్టార్ల సాగు భూమిలో రైతులు వరి పంటకే ప్రాధాన్యత ఇస్తారని. వైరా శాసనసభ్యులు మాలోత్ రామదాసు నాయక్ వరి సాగుకు సాగునీరు అందిస్తామని సాగునీటిని విడుదల చేసినప్పటికీ అధికారులు సాగునీరు అందించలేమని ఆరుతడి పంటలు వేసుకోవాలని గ్రామాల్లో గ్రామసభల ద్వారా తెలపటం ఎంతవరకు సభబని అన్నారు. గోదావరి జలాల ద్వారా వైరా రిజర్వాయర్ ను బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ చేసిన తర్వాత ఎల్.నినో ప్రభావం వలన ఆరుతడి పంటలు వేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించడం బాధాకరమన్నారు. ఎల్నినో ప్రభావం రాష్ట్రవ్యాప్తంగా ఉన్నప్పటికీ వైరా రిజర్వాయర్ నీటిమట్టం ప్రస్తుతం 15.5 అడుగులు ఉందని. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ శాసనసభ్యులు బానోతు మదన్లాల్ 12 అడుగుల నీటిమట్టం ఉన్న ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందించారని గుర్తు చేశారు. ప్రస్తుత అధికారులు సాగునీరు మరియు వరి సాగుకు నీరు అందించలేమని ఆరుతడి పంటలను పండించడానికి సిద్ధం కావాలని కోరటం ఈ ప్రాంత రైతులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు. తక్షణమే వరికి సాగు నిర్వహించి వైరా ఆయకట్టు పరిధిలోని రైతులను ఆదుకోవాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్ర రాష్ట్రం పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను తీసుకువెళ్లి పంటలను సాగు చేస్తుంటే వైరా రిజర్వాయర్ కు గోదావరి జలాలు వచ్చినప్పటికీ సాగునీరు అందించలేమని చెప్పటం హాస్యాస్పదమని అన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు మాదినేని సునీత ప్రసాద్, చిలక చిన్న కోటయ్య, దొంతబోయిన వెంకటేశ్వర్లు, పాసంగులపాటి శివ, నూకల ప్రసాద్ రావు, కొల్లా రాంబాబు, మిట్టపల్లి కిరణ్, వజనేపల్లి చక్రవర్తి. కారుకొండ బోస్, వేముల శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.






# నాణ్యమైన విద్యను అందించడమే కేజీబీవీ లక్ష్యం....

**ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకై దరఖాస్తుల స్వీకరణ....**

**కళాశాల ప్రిన్సిపల్ ఝాన్సీ సౌజన్య.**

*కారేపల్లి,జూలై 18 (ప్రభాతవార్త)*

కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకై అర్హత కలిగిన బాలికల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల స్పెషల్ ఆఫీసర్ ఝాన్సీ సౌజన్య తెలిపారు. శనివారం కళాశాలలో ఆమె మాట్లాడుతూ.. కస్తూర్బా పాఠశాల కళాశాలలో ఏడవ తరగతిలో 3, ఇంటర్



ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 2, బైపీసీలో రెండు సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు.జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశానుసారం ఈ సీట్లను భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు.విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యతో పాటు ఉచిత వసతి,పోష్టికాహారం,పాఠ్య పుస్తకాలు,నోట్ బుక్స్, యూనిఫాంలు ప్రభుత్వం ద్వారా ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు.మహిళా సిబ్బంది పర్యవేక్షణలో సురక్షి త వాతావరణంలో విద్యను అందించడంతోపాటు స్పోర్ట్స్ అండ్ గైడ్స్ ద్వారా క్రమశిక్షణ,నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తున్నట్లు తెలిపారు.ఆసక్తిగల విద్యార్థుల తల్లిదండ్రులు అవసరమైన దువికరణ పత్రాలతో పాఠశాల పని దినాల్లో నేరుగా కేజీబీవీ విద్యాలయాన్ని సంప్రదించవచ్చని ఆమె తెలిపారు.

# నేడు కామేపల్లి మండలం లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్యటన

**మద్దులపల్లి లో విద్యుత్ సబ్ స్టేషన్, తాళ్లగూడెం, కామేపల్లి పెద్ద చెరువు బిటీ రోడ్లకు శంకుస్థాపనలు**

**కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు భారీగా పాల్గొని విజయవంతం చేయాలి**

**మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు పిలుపు**

*కామేపల్లి, జూలై 18 (ప్రభాతవార్త):*

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కామేపల్లి మండ లంలో ఆదివారం ఉదయం 11 గంటలకు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ సభ్యులు రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి తో కలిసి విస్తృతంగా పర్యటిస్తారని మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు శనివారం తెలిపారు.మద్దులపల్లి లో నూతనంగా నిర్మించనున్న విద్యుత్ సబ్ స్టేషన్, తాళ్ల గూడెం, కామేపల్లి పెద్ద చెరువు వద్ద నిర్మించనున్న బీటీ రోడ్లకు శంకుస్థాపన చే స్తారని తెలిపారు.మండల కాంగ్రెస్ నాయకులు అనుబంధ సంఘాల అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ కమిటి సభ్యులు, ప్రజా ప్రతినిధులు,మాజీ ప్రజా ప్రతినిధులు, అభిమానులు, ప్రజలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని డిప్యూటీ సీఎం మండల పర్యటనను విజయవంతం చేయాలని ఆయన కోరారు.మండల పర్యటన విజయవంతం కొరకు మండల పార్టీ ఆ ధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసినట్లు రాంబాబు వెల్లడించారు.



# సీసీ రోడ్ల నిర్మాణం లో ఆర్కే పురం పంచాయతీని ఆదర్శంగా నిలుపుతాం

**సర్పంచ్ అజ్మీర ద్వాలి, ఉప సర్పంచ్ అజ్మీర బన్సీలాల్**

**రూ.40 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లకు శ్రీకారం**

*కామేపల్లి, జూలై 18 (ప్రభాతవార్త):*

సిమెంట్ రోడ్ల నిర్మాణంలో కామేపల్లి మండలం రామకృష్ణాపురం పంచాయతీని జిల్లాలోనే ఆదర్శంగా నిలుపుతామని ఆర్.కె పురం సర్పంచ్ అజ్మీర ద్వాలి, ఉప స ర్పంచ్ అజ్మీర బన్సీలాల్ అన్నారు.ఎంజి ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.40 లక్షలతోపంచాయతీ పరిధిలోని గ్రామాల్లో నిర్మించనున్న సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను శనివారం



ప్రారంభించారు.అనంతరం వారు మాట్లాడుతూ పంచాయితీ సమగ్ర అ భివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు.తమ కృషికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.గ్రామ గ్రామాన, వాడ వాడల్లో సిమెంట్ రోడ్లను నిర్మించి ప్రజాఇబ్బందులను తొలగించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్ర మంలో పి ఆర్ ఏ ఈ వేములపల్లి కేశవ రావు,పంచాయతీ పాలకవర్గ సభ్యులు భాగం రంగారావు, భూక్య చింత, అజ్మీర విజయ, జరపల కృష్ణ,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సూదనపు కోటయ్య, అజ్మీర చిన్న, మాజీ సర్పంచులు జరపల రామారావు, అజ్మీర రాందాస్ నాయక్, అజ్మీర హరినాయక్, మాజీ ఎంపీటీసీ దొడ్డిగర్ల సుందరం, ప్రముఖ కాంట్రాక్టర్ రామల్ల రామమూర్తి,పేరసాని ప్రసాద్, ఆంగోత్ రమేష్, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని సర్పంచ్ మత్రు వినతి....

*కారేపల్లి జూలై 18 (ప్రభాతవార్త)*

సింగరేణి మండలం దుబ్బ తండ గ్రామపంచాయతీ గ్రామ సర్పంచ్



మత్రు నాయక్ ఆధ్వర్యంలో గ్రామంలో అవసరమైనచోట కొత్త కరెంటు స్తంభాలను ఏర్పాటు చేయాలని డి ఈ మరియు ఏఈలకు లకు వినతి పత్రాన్ని అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన విద్యుత్ అధికా రులు త్వరలోనే సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘం 3వ,రాష్ట్ర మహాసభను విజయవంతం చేయండి

**గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల మల్లయ్య**

*కామేపల్లి, జూలై 18 (ప్రభాతవార్త):*

ఈనెల 26న గణేష్ గార్డెన్ రఘునాథపా లెం లో జరుగనున్న గ్రామ పంచాయతీ వ ర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ మూడ వ రాష్ట్ర మహాసభ ను విజయవంతం చే యాలని కామేపల్లి మండలం లో శనివా రం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర నా యకులు తోట రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల మల్లయ్య మాట్లా డుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతినెల ప్ర భుత్వ ఉద్యోగి వలె ఒకటో తారీకు జీతా లు చెల్లించాలని ఆదేశాలు ఇచ్చినా సరే కింది స్థాయి అధికారులు ఒకటో తారీకు జీతాలు చెల్లించాలని మల్టీపర్పస్ విధా నం సవరించి పాత పద్ధతి వలె కేటగిరీ లాగా విభజించాలని,ఉద్యోగ భద్రత క ల్పించాలని కోరారు.పిఎఫ్,ఈఎస్ఐ,గ్రామ పంచాయతీ సిబ్బందికి 10 లక్షలు ఇన్సూ రెన్స్ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సమస్యలు మహాసభ ద్వారా తీ ర్మానం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించుకోవడం కొరకు ఈ మహాసభ దోహదపడుతుందని అభిప్రా యంను వారు వ్యక్తం చేశారు.



# సీతారామ ప్రాజెక్టు రూపకల్పన మొత్తం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఘనతే



పెనుబల్లి, జులై 18, ప్రభాతవార్త

సీతారామ ప్రాజెక్టు రూపకల్పన మొత్తం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఘనతేనని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అన్నారు. శనివారం స్థానిక సప్తపది ఫంక్షన్ హాల్లో ఎస్ఐఆర్ పై పార్టీ ముఖ్య కార్యకర్తలకు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ ఓటు చోరీ అంటూ ప్రచారం చేస్తుంటే, తెలంగాణలో మాత్రం క్రెడిట్ చోరీ జరుగుతోందని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టు రూపకల్పన మొత్తం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఘనతేనని అన్నారు. ప్రాజెక్టు క్రెడిట్ కోసం కాంగ్రెస్ మంత్రుల మధ్య పోటీ నెలకొందని, ఒక మంత్రికి తెలియకుండా మరో మంత్రి పర్యటనకు రావడం వారి అంతర్గత కుమ్ములాటలకు నిదర్శనమని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం వాటిని ఎదుర్కొనేందుకు తగిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రజలు గగ్గోలు పెడుతున్న తర్వాతే పంపులు ప్రారంభించారని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితులు రెండో ఎండాకాలాన్ని తలపిస్తున్నాయని, గోదావరి జలాలను సద్వినియోగం చేసుకుని రైతులకు సకాలంలో సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏ సర్వే చూసినా రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేసిన ఆయన కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ పెనుబల్లి అధ్యక్షులు కనగాల వెంకట్రావు, మాజీ జెడ్పిటిసి చెక్కిలాల మోహన్రావు, వినీల్ బాబు, ముండదపు అశోక్ కుమార్, చెక్కిలాల లక్ష్మణరావు, చెలి కానీ నీలాద్రి బాబు, కొప్పుల గోవిందరావు, పసుమర్తి వెంకటేశ్వరరావు, లగడపాటి శ్రీను, చింతనిప్పు శ్రీను, పెనుబల్లి సర్పంచ్ పాప, నారపోగు శారద, శిరీష, కోట ప్రభాకర్, బెల్లంకొండ శ్రీనివాస్ రావు, యలమర్తి శ్రీనివాసరావు, కొత్తగుండ్ల అప్పారావు, దొడ్డపనేని రవికుమార్, కొంగల రాంబాబు, మోరంపూడి మధు, సోషల్ మీడియా వారియర్స్ చంటి మరకాల, వెంకీ మరకాల, మరియు మండల నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సత్తుపల్లి పట్టణ అభివృద్ధిపై అధికారులతో మున్సిపల్ చైర్ పర్సన్ సమీక్ష

.. సత్తుపల్లి జులై 18 ప్రభాతవార్త

సత్తుపల్లి మున్సిపాలిటీలో ఇందిరమ్మ పాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి దయానందల సహాయ సహకారాలతో ప్రజలకు అందుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు పారిశుధ్యం తదితర వాటిపై మున్సిపల్ చైర్ పర్సన్ మహమ్మద్ రెహానా కమల్ పాషా శనివారం మున్సిపాలిటీలోని వివిధ విభాగాల అధికారులతో సమీక్షసమావేశం నిర్వహించారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణ ప్రగతిలో భాగంగా ప్రత్యేక ఓటర్ల జాబితా ఎస్ ఐ ఆర్ పై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి ఏమాత్రం ఓట్లు మిస్ కాకుండా చర్యలు తీసుకోవాలని చైర్పర్సన్ అధికారులకు సూచించారు. అలాగే పట్టణంలో కోట్లాది రూపాయలతో నడుస్తున్న డ్రైనేజీ ,సిసి రోడ్లు, పనుల నిర్మాణాల్లో నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ పడకుండా పనులు నాణ్యత గా ఉండే విధంగా ఇంజనీరింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండి పర్యవేక్షించాలని రెహానా కమల పాష ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా మున్సిపాలిటీలోని అన్ని వీధులలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా క్లీన్ అండ్ గ్రీన్ లక్ష్యంతో పరిశుభ్రంగా ఉండే విధంగా అధికారులు అప్రమత్తంగా ఉండిప్రజలనుచైతన్యవంతం చేయాలని చైర్పర్సన్ ఆ శాఖ అధికారులకు సూచించారు. ఎక్కడా కూడా చెత్తాచెదారం లేకుండా,



డ్రైనేజీలలో నీటి నిల్వలు లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచితే దోమల బెడద లేకుండా నివారించవచ్చని ఆమె సూచించారు. వీధులు అపరిశుభ్రంగా ఉన్నట్లయితే రానున్న వర్షాకాలంలో వివిధ రకాల దోమలు చేరి దోమకాటుకు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, తదితర వివిధ రకాల వ్యాధులు సోకి ప్రజలు అనారోగ్యాలు పాలయే అవకాశం ఉందని ముందు జాగ్రత్తలు తీసుకోవాలని చైర్ పర్సన్ అధికారులకు సూచించారు.మున్సిపాలిటీలోని అన్ని వీధులలో త్రాగునీటి సమస్య లేకుండా పైపులైన్ల లీకేజీలు అయినట్లయితే వాటిని గుర్తించి వెంటనే మరమ్మత్తులు చేసి ప్రజలకు త్రాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులను చైర్పర్సన్ రెహానా కమల్ పాషా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే నరసింహం, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, మున్సిపల్ ఏఈ సురేష్, టిపిబిఓ కిరణ్, ఆర్ ఐ కె దిలీప్ కుమార్, సీనియర్ అకౌంటెంట్ సుజాత , మెప్మా సీవో ఆర్పీ ప్రసాదు పలువురు సిబ్బంది హాజరైన వారిలో ఉన్నారు

# భూభారతి సర్వే ప్రోగ్రాంపై రైతులతో తాసిల్దార్ సమీక్ష

హాజరైన పాకలగూడెం రైతులు...

సత్తుపల్లి జులై 18 ప్రభాత వార్త

సత్తుపల్లి మండలం బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని పాకలగూడెం పంచాయతీలోని 133/1 సర్వే నెంబర్ లో చాలామంది రైతులు భూమి సాగు చేసుకుంటూ భూ హక్కులైన పాస్ పుస్తకాలు పొందక ప్రభుత్వం నుంచి రావాల్సిన వివిధ రకాల రైతు భరోసా, రైతు బీమా, బ్యాంకు రుణాలు, తదితర పథకాలు అందక ఎన్నో సంవత్సరాల నుంచి ఇబ్బందులుగురవుతున్నారు. ఈ విషయాలను గ్రామ సర్పంచ్ ,ఉప సర్పంచ్, ధారావత్ సునీత కృష్ణ, చిన్న శెట్టి మాధవరావు లు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ద్వారా రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి పలుసార్లు తీసుకెళ్లడం వల్ల రైతులు సమస్య కు స్పందించిన మంత్రి పై సర్వేనెంబర్ను సుదీర్ఘంగా సర్వే చేయటానికి సర్వేయర్ల బృందాన్ని పై గ్రామానికి పంపించడం జరిగింది. పై సర్వే నెంబర్లో సాగులో ఉన్న ఆ గ్రామానికి



చెందిన రైతులు సర్వే అధికారుల బృందం వచ్చినప్పుడు దగ్గర ఉండే వారి భూములను సర్వే చేయించుకోవాలని పాకలగూడెంగ్రామపంచాయతీ కార్యాలయంలో తాసిల్దారు పున్నం సత్యనారాయణ శుక్రవారం రైతులని సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. సకాలంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి దయానంద, రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డిలు రైతుల సమస్యలు అర్థం చేసుకొని సకాలంలో పై సర్వే నెంబరు సర్వే చేయటానికి అధికారులను పంపించినందుకు గ్రామపంచాయతీ తరపున వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో జిపిఒ సత్యనారాయణ, గ్రామపంచాయతీ కార్యదర్శి శృతి ,ఆ రైతులు హాజరైన వారిలో ఉన్నారు.

# కప్పల బంధం లో పొంచి ఉన్న ప్రమాదం

కల్లూరు, జులై 18, ప్రభాతవార్త

కల్లూరు మండలం కప్పల బంధం గ్రామంలో నియంత్రిక కు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. నియంత్రికకు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రమాదాన్ని నివారించాలని కోరుతున్నారు. ఎక్కువగా పశువులు జీవాలు అదే సమయంలో రోడ్డు వెంట పిల్లలు తిరుగుతుంటారు. కావున ప్రమాదాలు నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని కల్లూరు విద్యుత్ శాఖ అధికారి కి విన్నవించుకుంటున్నారు.






# ఆవిరవుతున్న రైతుల ఆశలు

కల్లూరు, జులై 18, ప్రభాతవార్త



కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో జూన్ నెలలో కురిసిన వర్షాలకు కొందరు రైతులు వరి పంటను సాగు చేస్తున్నారు. జూలై నెలలో నేటికీ 17 రోజులు అయినా కూడా వర్షాలు కురవకపోవడంతో నెర్రలు భారీవారి పంట రైతులు ఆశలు ఆవిరైతున్నాయి. దాంతోపాటు పత్తి రైతులు కూడా సాగు చేస్తున్న పత్తి వడపడి రైతుల్లో ఆశలు అడియాసలుగా మారుతున్నాయి. కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో ఇప్పటికీ 13 వేల ఎకరాలలో పత్తి వరి ఇదే పరిస్థితి కొనసాగుతూ వస్తుంది మరి కొందరు పంటలను కొనసాగిద్దామంటే వర్షాల కోసం ఆకాశం వైపు చూస్తున్నారు.

# అంగన్వాడీ కేంద్రాల ఆకస్మిక తనిఖీ

కల్లూరు, జులై 18, ప్రభాతవార్త



కల్లూరు మండల పరిధిలో ఉన్న యజ్ఞనారాయనపురం, వెన్నవల్లి పంచాయతీలో ఉన్న 5 అంగన్వాడీ కేంద్రాలను శనివారం సిడిపిఒ నిర్మల జ్యోతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా .అంగన్వాడి కేంద్రాలలో ప్రీస్కూలు హాజ రు నమోదు ప్రకారం అటెండ్ అయ్యే విధంగా చూసుకోవాలని ,ఆరోగ్యలక్ష్మి మెనూ ప్రకారం వంట నిర్వహణ ఉండాలని అంగన్వాడీ కేంద్రంలో లబ్ది దారులు అందర్నీ నమోదు చేయాలని తెలిపారు . స్టాక్ రికార్డులు పరిశీలన చేయడం జరిగినది. తల్లులు పౌష్టికాహార తీసుకోవాలని టీచర్లకు సూచనలు జారీ చేయడం జరిగినది .ఈ సందర్భనలలో చంద్రుపట్ల సెక్టార్ సూపర్వైజర్ వెన్నవల్లి సర్పంచ్ లక్ష్మీ వెంకటేశ్వర రావు గారు, టీచర్స్ కరుణ, జ్యోతి, కమల, ఝాన్సీ పాల్గొన్నారు

# ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులకు అవగాహన

కల్లూరు, జులై 18, ప్రభాతవార్త

మండల పరిధిలోని వి.యం బంజర గ్రామంలో రైతులకు ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటల వైవిధ్యీకరణ, వ్యవసాయ కుంటల ప్రాముఖ్యతపై మండల వ్యవసాయ అధికారి ఏవీఎస్ ప్రసాద రాజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం అస్థిరంగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు నీటి అవసరం తక్కువగా ఉండే పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వరి సాగుకి బదులుగా పత్తి, పెసర, మినుము, కంది, నువ్వులు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం ద్వారా వాతావరణ మార్పుల వల్ల కలిగే నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. అలాగే సూక్ష్మ సేద్య పద్ధతులు, నీటి పొదుపు చర్యలను పాటించడం ద్వారా నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చన్నారు. రైతులు శాస్త్రీయ సాగు పద్ధతులను అనుసరిస్తూ పంటల వైవిధ్యీకరణ, నీటి సంరక్షణ చర్యలు చేపట్టి వాతావరణ మార్పుల ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవాలని అధికారులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఏఈఈ, నరేష్, పెనుబల్లి క్లస్టర్ ఏఈవో నరేష్, గ్రామ సర్పంచ్ భుక్య ప్రసాద్, గ్రామ ఉప సర్పంచ్ తాళ్లూరి రవి, గ్రామ పెద్దలు గోగినేని రమేష్, వంగ చంద్ర శేఖర్, పొన్నగంటి వాణి పతి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం

## ప్రజలు ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం

## మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఫైర్

**ఖమ్మం అర్బన్,జులై18 (ప్రభాత వార్త )**



ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రితో పాటు అన్ని ప్రభుత్వాసు పత్రుల్లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు అత్యంత ఆందోళన కరంగా ఉన్నాయని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. అవసరమైన మందులు, సిరంజీలు, గ్లోవ్స్, ఇతర ప్రాథమిక వైద్య సామగ్రి కొరత ఉందనే వార్తలు వస్తున్నాయని సరైన సమయంలో వైద్యులు, నిపుణులైన స్పెషలిస్టులు, నర్సింగ్ సిబ్బంది లేక వైద్య సేవలు ఆలస్య మవుతున్నాయని దాంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని కొన్ని పరిస్థితుల్లో మరణిస్తున్నారని ప్రజలు ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం ఆడటం దారుణం అని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ప్రజల ప్రాణాలకు సంబంధించిన వైద్య వ్యవస్థపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబించడం అత్యంత బాధాకరమని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రిలో మౌలిక వసతులను గణనీయంగా అభివృద్ధి చేశామని, కానీ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని, ఖమ్మం ప్రభుత్వాసుపత్రి గత వైభవాన్ని తిరిగి తీసుకురావడానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ డిమాండ్ చేశారు.

# భద్రాచలం కోర్టుకు పెద్దల పిలుపు..!

**24న డిప్యూటీ సీఎంతో పాటు మంత్రుల హాజరు..**

**సీతారామ కేసులో సమన్లు రాజకీయ కలకలం**

**22 మందిపై కేసు... 12 మంది మాత్రమే హాజరు**

**గైర్హాజరైన నేతలకు సమన్లు జారీ**

**భద్రాచలం కోర్టు చుట్టూ రాజకీయ వేడి**

**విచారణపై రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ**





**భద్రాచలం, జూలై 18 (ప్రభాత వార్త):** మూడేళ్ల క్రితం నమోదైన సీతారామ ప్రాజెక్టు సందర్శన కేసు మళ్లీ రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఉన్న మల్లు భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, కాంగ్రెస్‌కు చెందిన కీలక నేతలు ఈ నెల 24న భద్రాచలం కోర్టుకు హాజరుకానుండటంతో రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ మొదలైంది. అధికారంలో ఉన్న మంత్రులు కోర్టు బోనులో హాజరుకానుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. 2022లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ సీఎల్పీ పిలుపు మేరకు సీతారామ ప్రాజెక్టును సందర్శించేందుకు బయలుదేరిన కాంగ్రెస్ నేతలను మణుగూరు క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఉద్రిక్తత చోటుచేసుకోగా, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం, పోలీసుల విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలతో మొత్తం 22 మంది కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదైంది. ఆ కేసు ఇప్పుడు విచారణ దశకు చేరుకుంది. శనివారం భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి శివ నాయక్ కోర్టులో విచారణ జరిగింది. మొత్తం 22 మంది ముద్దాయిల్లో 12 మంది మాత్రమే కోర్టుకు హాజరయ్యారు. గైర్హాజరైన మిగిలిన ముద్దాయిలకు కోర్టు సమన్లు జారీ చేస్తూ జూలై 24న తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించింది. దీంతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, దనసరి అనసూయ( సీతక్క) కోర్టుకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరి ణామంతో భద్రాచలం రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఒకవైపు అధికార పార్టీ కీలక నేతలు కోర్టుకు హాజరుకానుండగా, మరోవైపు ప్రతిపక్షాలు ఈ అంశాన్ని రాజ కీయంగా ఉపయోగించుకునే అవ కాశాలు కని పిస్తున్నాయి. కోర్టు పరిసరాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు ఉండే అవకాశముందని అధికార వర్గాలు చెబుతున్నాయి. రాజకీయంగా ఎంతో సున్నితమైన ఈ కేసులో తదుపరి విచారణ ఎలా సాగుతుంది? ముద్దాయిల హాజరు అనంతరం కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? అనే అంశాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.



# వర్షాభావ పరిస్థితుల్లో పంటల సాగుపై రైతులకు అవగాహన

## పాల్గొన్న కొత్తగూడెం వ్యవసాయ సంచాలకులు సుధాకర్ రావు



**జూలూరుపాడు, ప్రభాతవార్త, జూలై 18:** మండల పరిధిలోని పాపకొల్లు రెవిన్యూ అన్నారుపాడు, పడమట నర్సాపురం రెవిన్యూ నర్సాపురం గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటల సాగుపై శనివారం రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా కొత్తగూడెం వ్యవసాయ శాఖ సంచాలకులు సుధాకర్ రావు హాజరై మాట్లాడారు. ప్రస్తుతం నెలకొన్న ఎల్నినో ప్రభావం వలన వర్షాభావ పరిస్థితులు రైతులను బ్బందులకు గురిచేస్తుందని అన్నారు. దీన్ని అధిగమించేందుకు తీసుకోవలసిన చర్యలపై వర్షాభావ పరిస్థితుల్లో సాగు చేయాల్సిన ప్రత్యామ్నాయ పంటల గురించి రైతులకు వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి పంట వేయకుండా ఆరుతడి పంటలు మరియు స్వల్పకాలిక రకాలైన పెసర, మినుము, కంది, నూనె గింజలు సన్ఫ్లవర్ మొదలగు పంటల వైపు మొగ్గు చూపాలని తెలియజేశారు. బోరు భావుల అవకాశం ఉన్న రైతులు సాగునీటి సామర్థ్యానికి అనుగుణంగా వరి పంటను సాగు చేసుకోవలసిందిగా సూచించారు. ప్రత్యామ్నాయ పంటలకు సంబంధించిన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి దీపక్ ఆనంద్, పాపకొల్లు ఏఈఓ విజయభాను, మాచినేనిపేట ఏఈఓ తేజస్వి, అన్నారుపాడు సర్పంచ్ ప్రసాద్, పడమట నరసాపురం సర్పంచ్ సంగం లక్ష్మీ క్రకుమారి, రైతులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంఖుస్థాపనలు

**నేలకొండపల్లి, జూలై 18 ప్రభాతవార్త:**



రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం నేలకొండపల్లి మండలం లోని వివిధ గ్రామాలలో విస్తృతంగా పర్యటించారు. కోరట్లగూడెం గ్రామంలో సీసీ రోడ్ల కు శంఖు స్థాపన చేశారు. లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కోనాయి గూడెం గ్రామ సమీపం లోని నందిగామ బ్రాంచి కెనాల్ పై హైలెవల్ వంతెన నిర్మాణంకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంఖుస్థాపన చేశారు. అలాగే, సదాశివపురం గ్రామం నందు నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనంను ఆయన ప్రారంభించారు. అంతేకాక, మోటాపురం, రాజేశ్వరపురం,అనాసాగారం, గువ్వలగూడెం తదితర గ్రామాలలో పలు కుటుంబాలను ఆయన పరామర్శించారు. టీడీపీ పార్టీకి చెందిన ఆరెగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ వడ్డె విశాల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన సర్పంచ్ వడ్డే విశాల కు మంత్రి శ్రీనివాసరెడ్డి కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి సాదరంగా అహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని చెప్పారు. ఈ కార్య క్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్న పూసల సీతారాములు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొడాలి గోవిందరావు, కోరట్లగూడెం గ్రామ సర్పంచ్ కొత్తపల్లి త్రివేణి, అజయ్ తండా గ్రామ సర్పంచ్ తేజవత్ శివాజీ, చెన్నారం పిఏసిఎస్ చైర్మన్ వందనపు నాగేశ్వరరావు, రాజారాంపేట సర్పంచ్ రాయ పూడి రామారావు, బోదులబండ గ్రామ సర్పంచ్ కట్టెకోల నాగార్జున, జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు బొడ్డు బొందయ్య, బచ్చలకూరి నాగరాజు, కొత్తపల్లి సుబ్బయ్య, నెల్లూరి భద్రయ్య, చింతనిప్పు సైదులు, పెంటమల్ల పుల్లమ్మ, జెర్రిపోతుల అంజని, మామిడి వెంకన్న, రాయపూడి నవీన్, లక్కం ఏడుకొండలు, మైసా శంకర్, పసుపులేటి శ్రీలత, పసుపులేటి ఉపేందర్, కన్నారెడ్డి, నంబూరి రామారావు, జెర్రిపోతుల సత్య నారా యణ, తిగుళ్ల భవాని, పాకనాటి కన్నారెడ్డి, చెరుకుపల్లి రాజేష్, కర్ల ఆశోక్, ఆనం వెంకటరెడ్డి, బోయిన కొండలు, వడ్లమూడి నర్సయ్య, కొత్తపల్లి నవీన్, నాగరాజు, మనోజు, నల్లాని మల్లిఖార్జునరావు, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఎస్ఐ శంకర్ కుమారుడి మృతికి ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు నివాళి

**భద్రాచలం క్రైమ్, ప్రభాతవార్త:**

భద్రాచలంలో ట్రాఫిక్ ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శంకర్ కుమారుడు హరీష్ శనివారం అనారోగ్యంతో మృతిచెందడం తీవ్ర విషాదానికి గురి చేసింది. హరీష్ మృతికి పోలీస్ ఉన్నతాధికారులు, తోటి ఉద్యోగస్తులు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, ప్రముఖులు నివాళు లర్పించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు హరీష్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శంకర్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే, హరీష్ మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారికి తన పూర్తి అండదండలు ఉంటాయని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అరికెల్ల తిరుపతిరావు, భీమవరపు వెంకటరెడ్డి, పట్టణ ప్రముఖులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొని హరీష్‌కు నివాళులర్పించారు.






## సిఎంఆర్ఎఫ్ చెక్కు అందించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

అశ్వాపురం,ప్రభాతవార్త, జూలై 18:



అశ్వాపురం గ్రామానికి చెందిన షేక్ సాదిక్ బాబాకు మంజూరైన రూ.60 వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును వారి బంధువులు యూసఫ్‌కు అందజేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.అశ్వాపురం గ్రామానికి చెందిన షేక్ సాదిక్ బాబాకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.60,000 సీఎంఆర్ఎఫ్ చెక్కును వారి బంధువు యూసఫ్ కు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలుస్తూ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం భరోసాగా నిలుస్తోందని పేర్కొన్నారు.

## పోడు సాగుదారులపై ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యాలు ఆపాలి

**బీఆర్ఎస్ పార్టీ మండల కమిటీ,ఆదివాసి సర్పంచ్ ల ఖండన**

ఆశ్వాపురం,ప్రభాతవార్త, జూలై 18:



వేములూరు గ్రామంలో ప్లాంటేషన్ పేరుతో ఆదివాసి మహిళలను భయభ్రాంతులకు గురిచేసి విచక్షణ రహితంగా వారిపై దాడి చేయటం హేయమైన చర్య అని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు కోడి అమరేందర్,మర్రి మల్లారెడ్డి ఫారెస్ట్ అధికారులను హెచ్చరించారు.శనివారం బీఆర్ఎస్ పార్టీ మండల కార్యాలయంలో ఆదివాసి సర్పంచు లతో కలిసి నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ఆదివాసులకు పోడు పట్టాలు ఇచ్చి పూర్తి హక్కులు కల్పించగా ఎన్నికల ముందు పెండింగ్ లో ఉన్న పోడు భూములకు పట్టాలు ఇస్తామని ఓట్లు వేయించుకున్న రేవంత్ ప్రభుత్వం పోడు భూములు లాక్కొవడానికి ప్రయత్నించడం దారుణం అన్నారు.కనీసం మహిళలని కూడా చూడకుండా వారిపై విచక్షణారహితంగా దాడి చేసి దౌర్జన్యానికి పాల్పడడం ఫారెస్ట్ అధికారుల పరాకాష్ట కు నిదర్శనం అన్నారు.వెంటనే బాధిత ఆదివాసులకు క్షమాపణ చెప్పి అర్హులైన పోడు సాగుదారులకు పట్టాలు ఇచ్చి వారికి పూర్తి హక్కులు కల్పించాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ తరుపున బాధితుల కోసం న్యాయపోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

**నెల్లిపాక రెవిన్యూ భూములను నిషేధిత జాబితా నుండి తొలగించాలి**

అశ్వాపురం మండలంలోని నెల్లిపాక రెవెన్యూ భూములను నిషేధిత జాబితాలో పెట్టి రైతుల హక్కులను కాలరాస్తున్న ప్రజా ప్రభుత్వం కళ్ళు తెరవాలని రేపు మండల పర్యటనకు వస్తున్న రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ సమస్యపై స్థానిక రైతాంగానికి భరోసా నివ్వాలని తక్షణమే నెల్లిపాక రెవిన్యూ లోని భూములను నిషేధిత జాబితా నుండి తొలగించాలని స్థానిక రైతాంగం తరుపున బీఆర్ఎస్ పార్టీ మండల కమిటీ డిమాండ్ చేస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి సర్పంచ్ లు,ముర్రం సమ్మయ్య, కొండ్రు సోమయ్య,కోర్సా అలివేలు, రామారావు, కల్లేటి నరసింహ రావు,గొర్రెముచ్చు వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

## రైతు వేదికల నిధులు విడుదల చేయాలి

**టీపఈవోఏ నేతలు డాక్టర్ కొమరం లక్ష్మణ్ రావు, ఎం. స్నేహ పవన్**

మణుగూరు, ప్రభాతవార్త , జూలై 18:



జిల్లాలోని 67 రైతు వేదికలకు 2022 సెప్టెంబర్ నుండి 2026 జూన్ వరకు పెండింగ్‌లో ఉన్న 46 నెలల నిర్వహణ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ శనివారం తెలంగాణ వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం జిల్లా వ్యవసాయ అధికారికి వినతిపత్రం సమర్పించింది. రైతు వేదికల్లో రైతు నేస్తం, శిక్షణలు, అవగాహన సదస్సులు నిరంతరం నిర్వహిస్తున్నా నిధులు లేక భవనాల మరమ్మతులు, విద్యుత్ బిల్లులు, తాగునీటి కల్పనకు అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సంఘం నేతలు ఆవేదన వ్యక్తంచేశారు. అలాగే టిఫైబర్ కనెక్టివిటీ లేక వ్యక్తిగత డేటాతో పనులు చేస్తున్నామని, పాత ట్యాబ్‌ల స్థానంలో కొత్తవి ఇవ్వాలని కోరారు. పెండింగ్ నిధులు, విద్యుత్ బకాయిలు చెల్లించి, ఇంటర్నెట్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ డాక్టర్ కొమరం లక్ష్మణ్ రావు, ప్రెసిడెంట్ ఎం. స్నేహ పవన్, సెక్రెటరీ బి. గోపి కృష్ణ, ట్రెజరర్ బి. ప్రవీణ్, మహమ్మద్ గౌస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన వీసారపు శ్రీపాల్ రెడ్డి

మరిపెడ,జూలై18,(ప్రభాత వార్త):

మరిపెడ పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన వేణుగోపాల్ రెడ్డి అత్తగారు పాల్‌రెడ్డి సుజాత (80) అనారోగ్య కారణాలతో ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వీసారపు శ్రీపాల్ రెడ్డి శనివారం మృతురాలి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో మల్లు ఉపేందర్ రెడ్డి, సర్వర్ పాషా, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఐటీడీఏ షాపింగ్ కాంప్లెక్స్ మరమ్మతులకు త్వరలో ప్రతిపాదనలు

**భద్రాచలం ఐటీడీఏ ఏపీవో డేవిడ్ రాజ్**

మణుగూరు, ప్రభాతవార్త, జూలై 18:



భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో మణుగూరులో ఏర్పాటు చేసిన షాపింగ్ కాంప్లెక్స్ భవనాన్ని శనివారం ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి (ఏపీవోజనరల్) డేవిడ్ రాజ్ పరిశీలించారు. వర్షాకాలంలో భవనం శిథిలావస్థకు చేరి వర్షపు నీరు లోపలికి వస్తోందని, దీనివల్ల కిరాణా, మీసేవ, జనరల్ స్టోర్స్ వంటి ఎనిమిది షాపుల నిర్వాహకులు నష్టపోతున్నారని ఐటీడీఏ పీవో బి.రాహుల్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు ఈ తనిఖీ చేపట్టారు. కాంప్లెక్స్‌ను పూర్తిస్థాయిలో పరిశీలించామని, త్వరలోనే మరమ్మతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి పీవోకు సమర్పిస్తామని ఏపీవో తెలిపారు. అనంతరం పీవీ కాలనీలో జరుగుతున్న సమగ్ర ఓటర్ల జాబితా సర్వేను ఆయన పరిశీలించారు. పీవీటీజీ అధికారి గన్యా, షాపు నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరు పీహెచ్‌సీలో డాక్టర్లను నియమించాలి

**సీపీఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్**

మణుగూరు, ప్రభాతవార్త, జూలై 18:



మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్ సీ)లో ప్రభుత్వ డాక్టర్లను వెంటనే నియమించాలని సీపీఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు.శివలింగాపురం, బాపనకుంట, శేషగిరినగర్, అన్నారం, రాజుపేట, విట్టల్‌రావునగర్, కమలాపురం తదితర గ్రామాల ప్రజలకు ఈ ఆసుపత్రే ఆధారం. గతంలో ఇద్దరు డాక్టర్లు ఉండగా, ఇటీవల ఉన్న ఒక్క డాక్టర్ కూడా బదిలీపై వెళ్లారు. దీంతో నెల రోజులుగా ఇక్కడ డాక్టర్ లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, డాక్టర్ లేకపోవడంతో కేవలం ఆయుర్వేద వైద్యుడితోనే సేవలు అందిస్తున్నారని ఆయన ఆరోపించారు. నిరుపేద ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్, డీఎంహెచ్ వో స్పందించి శివలింగాపురం పీహెచ్‌సీకి వెంటనే డాక్టర్‌ను కేటాయించాలని కోరారు.

## పోడు భూముల జోలికి వస్తే తీవ్ర పరిణామాలు తప్పవు

**తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డా. మైపతి అరుణ్ కుమార్**

పినపాక,ప్రభాత వార్త,జూలై 18.



పోడు భూముల రైతుల జోలికి వస్తే తీవ్ర పరిణామాలు తప్పవని తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డా మైపతి అరుణ్ కుమార్ హెచ్చరించారు.ఈ సందర్భంగా ఆయన శనివారం మండల పరిధిలోని బందగిరినగర్ గ్రామాన్ని ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ఆయన జిల్లా ప్రధాన కార్యదర్శి పోలేబోయిన వెంకట్ నారాయణ,ఆదివాసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు కలివేటి పవన్ కుమార్ తో కలిసి సందర్శించారు.అనంతరం గ్రామస్తులతో సమావేశమై పోడు భూములకు సంబంధించిన సమస్యలను తెలుసుకున్నారు. 2005కు ముందు నుంచి సాగులో ఉన్న సుమారు 100 ఎకరాల పోడు భూములను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకుని మొక్కలు నాటారని ఆయన ఆరోపించారు. 2022లో అటవీ హక్కుల చట్టం ప్రకారం పట్టాల కోసం దరఖాస్తు చేసినప్పటికీ, అధికారులు తప్పుడు సమాచారం సేకరించి అర్హులైన ఆదివాసులకు హక్కు పత్రాలు రాకుండా చేశారని ఆరోపిస్తూ విమర్శించారు. ఐటీడీఏ నిర్వహించిన సర్వే నివేదికలను సైతం పట్టించుకోవడం లేదన్నారు. ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో అమలులో ఉన్న చట్టాలను ఉల్లంఘిస్తూ ఆదివాసుల భూముల్లో అటవీశాఖ బలవంతంగా గుంతలు తవ్వి మొక్కలు నాటుతోందని ఆరోపించారు.పోడు భూముల జోలికి మళ్లీ వస్తే ఆదివాసీలు ఐక్యంగా ఉద్యమిస్తారని, కొమరం భీమ్ స్ఫూర్తితో భూములను కాపాడుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు,ఆదివాసి సంఘాల నాయకులు, పాల్గొన్నారు.

## విద్యార్థులకు సైకిళ్లతో పాటు ఆర్థిక తోడ్పాటు

చిన్నగూడూరు,జూలై18,ప్రభాతవార్త:

మండలంలోని జయ్యారం ప్రభుత్వ పాఠశాలలో శనివారం మంకెన ఉప్పలయ్య వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు వెంకటరమణ, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను నగదు బహుమతులతో సత్కరించారు. అదేవిధంగా ఆర్థికంగా వెనుకబడిన ముగ్గురు విద్యార్థులకు విద్యాభ్యాసం సులభతరం కావాలనే ఉద్దేశంతో సైకిళ్లను ఉచితంగా అందజేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు గ్రామీణ విద్యార్థుల్లో విద్యా పట్ల ఆసక్తిని పెంపొందించి, ఉన్నత లక్ష్యాల సాధనకు ప్రేరణగా నిలుస్తాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అన్నారు.